
ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

****



## నల్లగొండ

5

గురువారం 25 సెప్టెంబరు 2025


ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 586.60 (303.4310) | 3,66,816 | 3,66,816 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.62 (4.10) | 11,124.26 | 10,376.32 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 167.320 (34.6755) | 3,68,435 | 3,82,670 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

జీతం రాలే..

## పండుగ చేసుకునేదెలా?

● దసరాకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలు
● ఎన్నికల నోటిఫికేషన్ వస్తే జీతం ఎలా..



మండుటెండలో చేతులకు బొబ్బలు వచ్చేలా కష్టపడిన కూలీలకు వేతనాలు సకాలంలో అందడంలేదు. కుటుంబ పోషణలో కాసింత ఆసరా, అవసరాలకు సొమ్ము అక్కరకు వస్తుందన్న ఆశతో పనులకు వెళ్లిన కూలీలకు నిరాశే మిగులుతోంది. నెలానెలా చెల్లించాల్సిన జీతాలు, ప్రతీ రెండు వారాలకు ఓసారి చెల్లించాల్సిన ఉపాధి కూలి డబ్బులు నెలలు గడిచినా అందక ఇబ్బందిపడుతున్నారు. కూలీలకు పనులు కల్పించిన క్షేత్రస్థాయి సిబ్బందికి సైతం మూడునెలల వేతనాలు పెండింగ్‌లో కొనసాగుతుండడంతో దసరా పండుగకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలుపడి చూస్తున్నారు. దసరా పండుగ లోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా..? లేదోనన్న సందిగ్ధం నెలకొంది. 7

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్, మర్రిగూడ)

# మఖానా మొలకెత్తలే!

» బురద మడిలోనే తామర గింజలు
» ఆరు నెలలుగా మొలకెత్తని వైనం
» కంపసాగర్‌లో మొలిచింది ఒక్క మొక్కే
» వికటించిన ఫూల్ మఖానా ప్రయోగం
» దర్భాంగాలో చేసిన అధ్యయనం వృథానేనా?
» వేసవిలో విత్తనాలు నాటిన అధికారులు
» వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదన్న చర్చ

ఫూల్ మఖానా సాగును జిల్లా రైతులకు పరిచయం చేయాలనుకున్న అధికారుల ప్రయత్నాలు వికటించినట్టు కనిపిస్తోంది. జిల్లా రైతులు ఏటా వరి, పత్తినే సాగుచేస్తూ ఒకసారి లాభపడితే నాలుగుసార్లు నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బీహార్ రాష్ట్రంలో విస్తృతంగా సాగవుతున్న ఫూల్ మఖానాను అధికారులు జిల్లాలో ప్రయోగాత్మక సాగు చేపట్టారు. అయితే ఈ విత్తనాలు మొలకెత్తలేదు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ



ఫూల్ మఖానా మొలకలు లేని కంపసాగర్ నీటి మడి

జిల్లాలో, ఆ తరువాత ఉమ్మడి జిల్లాలో ఫూల్ మఖానా సాగును విస్తరింపజేసి రాష్ట్రంలోనే అన్ని ప్రాంతాల్లో సాగుపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతులకు ఫూల్ మఖానా (తామర గింజలు) పంటను గత మార్చి నెలాఖరునా పరిచయం చేసేందుకు నిర్ణయించి ప్రణాళిక రూపొందించి అమలులోకి తెచ్చారు. తొలుత జిల్లా అధికారులు మార్చి మొదటి వారంలో బీహార్ రాష్ట్రంలోని దర్భాంగాతో పాటు మిథిలాంచల్‌లో అధ్యయనం చేసి వచ్చారు. ఈ అధ్యయన బృందంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు కూడా ఉన్నారు. వారు మార్చి మొదటి వారంలో నాలుగైదు రోజులు ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేశారు. ఆ తరువాత జిల్లాలో ప్రయోగాత్మక సాగు చేపట్టేందుకు విత్తనాలను విత్తగా జిల్లా వాతావరణం అనుకూలించలేదన్న చర్చ సాగుతోంది. నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతంతో పాటు చెరువులు, కుంటల్లో నీరు నిండుగా ఉంటే విత్తనాలు అక్టోబరు నెలలో విత్తితే మొలకెత్తే పరిస్థితి ఉంటుంది. కానీ, అందుకు విరుద్ధంగా వేసవిలో విత్తనాలు విత్తడం వల్ల ప్రయోజనం లేదనే వాదన కూడా వినిపిస్తోంది.

### ఫూల్ మఖానా హబ్‌గా మార్చేందుకు

ఫూల్ మాఖానా ఉత్పత్తితో బీహార్ రాష్ట్రంలోని మిథిలాంచల్‌తో పాటు దర్భాంగా, మధుబని, బేట్‌యా, లావూర్యా ఇతర జిల్లాలు అభివృద్ధి చెందడంతోపాటు సాగుతో ప్రసిద్ధి చెందాయి. ఆ రాష్ట్రంలో ఫూల్ మాఖానాకు జియో ట్యాగ్ కూడా లభించింది. ఆ రాష్ట్రంలో ప్రధానంగా చెరువులు, కుంటలు నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో వీటిని అధికంగా సాగు చేశారు. ఈ మిగతా 8వ పేజీలో...

## అసలైన నేరస్థులు కాంగ్రెస్ పెద్దలే

మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



కొత్తపేటతండాలో సాయిసిద్ధును పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

దామరచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్దలే అసలైన నేరస్థులని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేటతండాలో సాయిసిద్ధును ఆయన పరామర్శించి మాట్లాడారు. యూరియా కోసం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న గిరిజన యువకుడు సాయిసిద్ధునాయక్‌పై పోలీసులు విచక్షణారహితంగా దాడిచేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఆటవిక, అరాచక రాజ్యం నడుస్తోందని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచక పాలనచేస్తూ అక్రమ కేసులను బనాయిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో గ్రామస్థాయి నాయకులు సైతం హుకూం జారీచేస్తూ పోలీస్‌స్టేషన్లలో రైతులు, సామాన్యులపై కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాను మంత్రిగా పనిచేసిన కాలంలో ఎందరో ఎస్పీలు ఉమ్మడి జిల్లాలో పనిచేశారని, వారిపై తాను ఎలాంటి హుకూం జారీ చేయలేదన్నారు. గడిచిన పదేళ్లలో ఎస్పీలు స్వేచ్ఛగా విధులు నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం నిర్వాహకంపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ఇష్టం వచ్చినట్లు లాఠీలతో కొట్టే అధికారం పోలీసులకు లేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. యూరియా కోసం రోజులతరబడి లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. సాయిసిద్ధుపై పోలీసులు విచక్షణరహితంగా కొట్టి గాయపరచడం అనాగరిక చర్య అని, దీనిపై స్పందించాల్సిన జిల్లా పోలీసు అధికారులు కిందిస్థాయి అధికారులను వెనకేసుకొచ్చి తప్పేమి లేదనట్లుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరైన పద్ధతికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గిరిజన యువకుడిపై దాడి చేసిన ఎస్ఐ, పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతుల సమస్యలు పట్టని సీఎం రేవంత్‌రెడ్డి మూటలు కట్టుకొని ఢిల్లీలో సమర్పించే పనిలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆయన సంపాదనలో రాహుల్, మోదీకి 20శాతం సమర్పిస్తున్నారని విమర్శించారు. జగదీ‌ష్‌రెడ్డి వెంట ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, భగత్‌కుమార్, విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు సిద్దార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివా‌స్‌రెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, బాలాజీనాయక్, అంగోతు హాతీరాం, ప్రకాశ్‌నాయక్ ఉన్నారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్




నెలవారీ నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల సంఖ్య తగ్గించేందుకు ప్రణాళికా ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. కేసుల విచారణ పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకుశంగా పరిశోధించాలన్నారు. పోక్సో, తీవ్రమైన కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతీ అధికారికి సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం)పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. నేర పరిశోధన, స్టేషన్ నిర్వహణ తెలిసి ఉండాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు సమీక్షించుకొని కేసుల సంఖ్య తగ్గించే దిశగా పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు రవికుమార్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చేపా.. చేపా..

## ఎందుకు పెరగట్లే

● నిర్లక్ష్యం నీడన 'ఇండ్లకోటయ్యగూడెం' మత్స్య బీజ క్షేత్రం
● చేప పిల్లల ఉత్పత్తి అంతంత మాత్రమే
● పట్టించుకోని అధికారులు 6

మత్స్యసంపదను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిడమనూరు మండలం తుమ్మడం శివారు ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో 1990లో 75ఎకరాల విస్తీర్ణంలో మత్స్య బీజ క్షేత్రాన్ని ఏర్పాటుచేసింది. 2.5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన 20 నర్సరీలు, 38 పాండ్స్ నిర్మించింది. కానీ గత ప్రభుత్వం మత్స్య బీజ క్షేత్రం నిర్వహణను వరంగల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. అయితే మూడేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి ఉత్పత్తి చేపట్టకపోవడంతో ఈ లీజు రద్దయింది. దీన్ని ఇటీవలి ప్రభుత్వమే నిర్వహిస్తుండగా, ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

● ఆంధ్రజ్యోతి, నిడమనూరు

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి వచ్చే రోగుల ఓపీ, ఏఎన్‌సీ, శానిటేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించి పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, రోగుల వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రకా‌ష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి డిండి రోడ్డులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, తదితరులు ఉన్నారు.

### డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, చందంపేట): చందంపేట మండలంలోని గాగిళ్లపూరంలో నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం పరిశీలించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సిబ్బంది వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఉన్నారు.

## పోషకాహార లోపాన్ని నివారించాలి



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లు, సామాజిక మార్పుతో పోషకాహార లోపాన్ని నివారించవచ్చని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో 'అందరికీ పోషకాహారం'పై మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, చిన్నారుల్లో పోషకాహారలోపం కొనసాగడం విచారకరమన్నారు. రక్తహీనత నిర్మూలన, పోషకాహారం తీసుకోవడంపై కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతలు మరింత శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ, అక్టోబరు 16వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ పోషకాహారానికి సంబంధించి 40 అంశాలతో ఫొటో ప్రదర్శన నిర్వహించారు. న్యూట్రీ హబ్ కింద పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీబీసీ సహాయ సంచాలకుడు జికోటేశ్వరావు, సీడీపీవో మమత, వైద్యాధికారి సంజయ్‌కుమార్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, పాల్గొన్నారు.

## మొక్కలు ఎండిపోకుండా చర్యలు

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నాంపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు తుంగపాడు గ్రామంలో నర్సరీని తనిఖీ చేసి మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మునగతోటను పరిశీలించారు. రైతు మల్లయ్యను మునగ సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మునగ లాభదాయకంగా ఉందని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఎక్కువ మంది రైతులు సాగుకు ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ఎంపీవో ఝాన్సీ, ఏపీవో వెంకటేశం, శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు, ఉన్నారు.


మూసీకి కొనసాగుతున్న వరద 6

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు 7


## పండుగలే లక్ష్యంగా ఆర్టీసీ దోపిడీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పండుగలే లక్ష్యంగా ఆర్టీసీ అదనపు చార్జీలు పెంచి ప్రభుత్వం దోపిడీ చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగల సమయంలో 50శాతం బస్ చార్జీలు పెంచుతున్నారని, ప్రయాణికుల సౌకర్యం కోసం బస్సులు నడపడం ప్రభుత్వం బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ పురుషుల వద్ద అత్యధిక చార్జీలు వసూలు చేయడం ఇదెక్కడి న్యాయమన్నారు. ప్రజా పాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల పాలిట కష్టాలు తెచ్చే ప్రభుత్వంగా మార్చారన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కనీసం రాష్ట్రంలో ఎంత భూమి సాగులో ఉందో లెక్కలు కూడా తెలియకుండా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రైతులు యూరియా కోసం తంటాలు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఫకీరు మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటేశం, నాయకులు బీపంగి జగ్జీవన్, పిండి పాపిరెడ్డి, మంగళపల్లి కిషన్, దాసరి వెంకన్న, పులకరం భిక్షం, దాసరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## త్రిపుల్‌ఆర్ బాధితులు పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): త్రిపుల్‌ఆర్ పేరుతో ప్రభుత్వం మరోసారి రైతులను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, దీనిపై ప్రతిఘటనకు బాధితులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మలపల్లి వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిపుల్‌ఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేసే రైతు పోరాటానికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మొదట అలైన్‌మెంట్‌కు ఒప్పందం చేసుకున్నారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రెండో, మూడో అలైన్‌మెంట్‌లను తీసుకువచ్చి 100 మీటర్లకు రహదారిని పెంచారని, పాటు అదనంగా మరో 40మీటర్లు రైల్వే లైన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతులకు మార్కెట్ ధర ప్రకారం కాకుండా రిజిస్ట్రేషన్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని చూస్తున్నారన్నారు. ఎకరాలకు రూ.80లక్షల నుంచి రూ.కోటి ధరక ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.4లక్షల వరకు పరిహారం చెల్లించాలనుకుంటోందని అన్నారు. బాధిత రైతులను ఈ నెల 26వ తేదీ వరకు సమీకరించి 27న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. త్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోయిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ, బషీర్, తదితరులు ఉన్నారు.

● అన్నపూర్ణా దేవిగా ఎల్లమ్మ



శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ 8



క్షేత్రంలో వృథాగా ఉన్న పాండ్



# చేపా.. చేపా.. ఎందుకు పెరగట్లే..

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఇండ్ల కోటయ్యగూడెం వద్ద ఉన్న బీజోత్పత్తి క్షేత్రంలోని చేపలు 'చేపా చేపా ఎందుకు పెరగట్లే అంటే పట్టించుకునే వారేరని అంటున్నట్లు ఉన్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విస్తారమైన భూమి, నీటి వనరులు ఉన్నా ఈ క్షేత్రం నిర్వహణ అధ్వానంగా మారడంతో తమకు ఈ పరిస్థితి దాపురించిందని చేపలు మొరపెట్టుకున్నట్లే ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. నర్సరీల్లో మాత్రమే ఏదో మొక్కుబడిగా పిల్లలను పెంచుతున్నారు. కానీ పాండ్స్ వృథాగా ఉంటున్నాయని, దీంతో ఈ క్షేత్రం మత్స్యకారులకు ఎలాంటి చేయూతనివ్వడం లేదని వారంటున్నారు.



● నిర్లక్ష్యం నీడన 'ఇండ్లకోటయ్యగూడెం' మత్స్య బీజ క్షేత్రం
● చేప పిల్లల ఉత్పత్తి అంతంతమాత్రమే ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

మత్స్యసంపదను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం శివారు ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో 1990లో 75 ఎకరాల విస్తీర్ణంలో మత్స్య బీజ క్షేత్రం ఏర్పాటుచేసింది. 2.5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన 20 నర్సరీలు, 38 పాండ్స్ నిర్మించింది. ఉత్పత్తి చేసిన చేపపిల్లలను జిల్లాలోని మత్స్య సొసైటీల ద్వారా చెరువుల్లో వదిలి మత్స్య సంపదను అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారులకు దోహదం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే మొదట్లో ఇక్కడ ఉత్పత్తి చేసిన చేపపిల్లలను చుట్టుపక్కల మండలాల్లోని చెరువుల్లో వదిలే వారు. కానీ గత ప్రభుత్వం మత్స్య బీజ క్షేత్రం నిర్వహణను వరంగల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీకి లీజుకు అప్పగించింది. కానీ మూడేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి ఉత్పత్తి చేపట్టలేదు. అనంతరం అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లీజు రద్దు చేయించారు. దీంతో ఇటీవలి ప్రభుత్వమే దీనిని నిర్వహిస్తోంది.

### ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు

నల్లగొండ జిల్లాలో 249 మత్స్య సహకార సొసైటీలు పనిచేస్తున్నాయి. ఇండ్లకోటయ్యగూడెం మత్స్య బీజ క్షేత్రంలో లక్ష్యం మేరకు చేపపిల్లలు ఉత్పత్తి చేస్తే సొసైటీల పరిధిలోని చెరువులకు చేపపిల్లలు పంపిణీ చేయవచ్చు. మత్స్యకారులకు కూడా చేయూతనిచ్చేందుకు ఎంతో కొంత దోహదపడుతుంది. కానీ క్షేత్రం నిర్లక్ష్యానికి గురికావడంతో చెరువుల్లో వదిలేందుకు సరిపడా చేపపిల్లల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. చెరువుల్లో ఎంతమేరకు వదులుతున్నారో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు మాత్రం లక్షల సంఖ్యలో పిల్లలను వదులుతున్నట్లు చెబుతున్నారు. చేపపిల్లల కొనుగోలులో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని సొసైటీల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మత్స్య సొసైటీ సభ్యులు కూడా నష్టపోతున్నారు.

### 30 లక్షల చేపపిల్లల ఉత్పత్తి

మత్స్య బీజ క్షేత్రంలో చేపపిల్లల ఉత్పత్తి విషయంలో కూడా పొంతనలేని సమాధానాలు వినిపిస్తున్నాయి. సరైన వివరణ ఇచ్చేవారే కరువయ్యారు. ఈ ఏడాది 30 లక్షల మేరకు చేపపిల్లలను ఉత్పత్తి చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నా అక్కడ ఎలాంటి చేపపిల్లల సీడ్ కనిపించడం లేదు. మూడు కోట్ల మేరకు పిల్లలను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన నర్సరీలు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నర్సరీలు, పాండ్స్ వృథాగా ఉంటున్నాయి.



ప్రహరీ కూడా సరిగా లేని మత్స్యబీజ క్షేత్రం

### వేధిస్తోన్న సిబ్బంది కొరత

మత్స్య బీజ క్షేత్రాన్ని సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడ ఎఫ్‌డీవోతో పాటు కొందరు సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికీ అక్కడ ఎవరూ ఉండటం లేదు. కేవలం ఫిషర్‌మెన్, ఫీల్డ్‌మెన్ మాత్రమే ఉంటున్నారు. కనీసం వాచ్‌మెన్ కూడా లేడు. సరైన సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం తదితర కారణాల మూలంగా క్షేత్రం నిరుపయోగంగా కనిపిస్తుంది. క్షేత్రం నిర్వహణను భువనగిరి మత్స్యశాఖ ఏడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన ఇంతవరకు క్షేత్రాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. పర్యవేక్షణ లేకపోవడంతో మత్స్య బీజ క్షేత్రానికి చెందిన 75 ఎకరాల భూమిలో కొంత ఆక్రమణకు గురవుతోంది. ప్రస్తుతం 63ఎకరాల వరకు మాత్రమే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా క్షేత్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. పలువురు మద్యం తాగడం, పేకాట ఆడటం జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చేపపిల్లలను ఉత్పత్తి చేసి సొసైటీలకు సరఫరా చేసి చెరువుల్లో వదిలేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సొసైటీల బాధ్యులు కోరుతున్నారు. కాగా మత్స్య బీజ క్షేత్రం నిర్వహణపై అధికారుల వివరణ కోరేందుకు వెళ్లగా అక్కడ ఎవరూ అందుబాటులో లేరు. ఫోన్‌లో కూడా సంప్రదించేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.

### నాణ్యమైన చేపపిల్లలు ఉత్పత్తి చేయాలి

ఇండ్లకోటయ్యగూడెంలోని మత్స్య బీజ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించాలి. నాణ్యమైన చేపపిల్లలు ఉత్పత్తి చేసి చెరువులకు పంపిణీ చేయాలి. మత్స్యకారులకు మేలు చేసేలా మత్స్య బీజ క్షేత్రాన్ని నిర్వహిస్తే మత్స్యకారులకు ప్రయోజనం ఉంటుంది.

ఎం.వెంకటయ్య, మాజీ మత్స్య సహకార సంఘం చైర్మన్, నిడమనూరు.

## పోలీసులపై దాడి ఘటనలో 14మంది అరెస్టు




హుజూర్‌నగర్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో పోలీసులపై దాడిచేసిన ఘటనలో 14 మంది యూపీ, బీహార్ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హాజీ ఏపీ బావా అండ్ కో కంపెనీ ద్వారా డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ నివాసి వినోద్ ఈ నెల 21వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. అతని కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఈ నెల 22వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌కు చెందిన పలువురు కార్మికులు ఉదయం 10గంటల సమయంలో డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. ఫ్యాక్టరీలోకి ఎవరినీ వెళ్లనివ్వకుండా, బయటకు రానివ్వకుండా ధర్నా చేశారు. సిమెంట్ పరిశ్రమ ఇచ్చిన సమాచారంమేరకు పాలకవీడు ఎస్‌ఐ కోటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యంతో కూర్చుని మాట్లాడుకోవాలని కార్మికులకు సూచించారు. ధర్నా చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముఖేష్‌ప్రసాద్, మంజిత్‌కుమార్, మన్సూర్‌అలం, శక్తి చౌహన్, రవిశంకర్‌సహానీ, ధనుంజయ్, కమలేష్‌యాదవ్, ఉమేష్‌కుమార్‌యాదవ్, బీహార్‌కు చెందిన భానుపోల్దార్, విక్రమ్‌కుమార్, అభిషేక్ కుమార్, రాహుల్‌కుమార్, మన్సూర్‌అన్సారి, సచిన్‌విశ్వకర్మ గ్రూప్‌గా ఏర్పడి ఎస్‌ఐ, పోలీసు సిబ్బందిపై కర్రలు, రాళ్లతో దాడిచేశారు. కార్మికుల దాడిలో పోలీస్ వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎస్‌ఐ కోటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం పాలకవీడు సమీపంలోని విష్ణుపురం రైల్వేస్టేషన్ వద్ద ఎ-1, ఎ-4 నిందితులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు తెలిపిన వివరాల ప్రకారం ఎ-6 నుంచి ఎ-15 వరకు నేరస్తులను పట్టుకుని వారి వద్ద ఉన్న కర్రలను స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న ఎ-5 నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

## చందాలకు ప్రత్యామ్నాయంగా లక్కీడ్రా ఆఫర్

● దేవీశరన్నవరాత్రోత్సవాల కోసం చౌడంపల్లి యువసేన వినూత్న నిర్ణయం ● మొదటి ప్రైజ్ మేక(గొర్రె)పొట్టేలు వరుసగా పట్టుచీర, మందు, నాటుకోడిపుంజు




చౌడంపల్లి యువసేన దసరా లక్కీ డ్రా ఆఫర్ బ్రోచర్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందాలు వసూలు చేసి ఉత్సవ వేడుకలకు ఖర్చు చేయడం ద్వారా గ్రామస్తుల నుంచి విమర్శలకు తావివ్వకూడదనుకున్న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లికి చెందిన ఉత్సవ కమిటీ వినూత్నంగా ఆలోచించింది. చౌడంపల్లి యువసేన ఆధ్వర్యంలో గణేశ్, దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులే చందాలు వేసుకుని దుర్గామాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే చందాలు వసూలు చేసి మొహమాటపడేకన్నా లాటరీ పెట్టి డబ్బులు సమకూర్చుకోవాలని ఆలోచించారు. తమ ఆలోచనను కార్యాచరణలో పెట్టారు. దసరా నవరాత్రి లక్కీ డ్రా ఆఫర్‌ను ప్రకటించారు. మొదటి ప్రైజుగా గొర్రె(మేక)పొట్టేలు, ద్వితీయ బహుమతిగా పట్టు చీర, తృతీయ బహుమతిగా ఫుల్(మద్యం) బాటిల్, నాలుగో బహుమతిగా నాటుకోడి పుంజును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం సోషల్‌మీడియా ద్వారా విస్తృతప్రచారం చేశారు. ఒక్కోలాటరీ టికెట్ ధరను రూ.200లుగా నిర్ణయించారు. ఈ విధంగా సమకూరిన డబ్బుతో బహుమతులు ఇవ్వగా పోను మిగిలే డబ్బులతో గ్రామస్తులను ఆధ్యాత్మిక యాత్రకు తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు లక్కీ డ్రా ఆఫర్ రూపకర్తల్లో ఒకరు తెలిపారు.

## వాగు దాటాలంటే భారీవాహనం కావాల్సిందే

● ఉధృతంగా ప్రవహిస్తున్న కోడూరు వాగు





కోడూరువాగును ట్రాక్టర్‌లో దాటుతున్న ప్రజలు, ఎక్స్‌కవేటర్‌లో ద్విచక్రవాహనాన్ని తరలిస్తున్న స్థానికులు

అర్వపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో భారీ వర్షానికి కోడూరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొమ్మాల, కోడూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోడూరు వాగు పైన 12గొలుసు కట్టు చెరువులు ఉండటం, అవి అలుగులు పోస్తుండతో ఒకేసారి బుధవారం ఉదయానికి వాగుకు వరద పెరిగింది. దీంతో ప్రజలు నానాఇబ్బందులుపడ్డారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో వాగును దాటారు. భారీవర్షాలు కురిసిన సమయంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కోడూరు గ్రామ ప్రజలకు అన్ని వైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు ఎటూపోయే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కిందట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించినా అడుగు ముందుకు పడలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. 10రోజులకుపైగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా మూసీ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో మంగళవారం నుంచి మూసీకి వరద పోటెత్తిన వరద ఉధృతి బుధవారం సైతం కొనసాగింది. మంగళవారం సాయంత్రానికి 12184.84 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో కొంతమేర తగ్గి బుధవారం సాయంత్రానికి 10376.32క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో మంగళవారం ఎత్తిన తొమ్మిది క్రస్ట్‌గేట్లలలో రెండింటిని మూసివేసిన అధికారులు 2, 3, 4, 7, 8, 10, 12 నెంబరు క్రస్ట్‌గేట్లను రెండు అడుగులు ఎత్తి మొత్తం 10679.56 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 384.48క్యూసెక్కుల సాగునీటిని కలిపి 11124.26క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.62అడుగులు(4.10టీఎంసీ)లుగా ఉంది.

## భర్త కోసం అత్తింటి ముందు బైఠాయింపు



పెళ్లి ఫొటోతో ఆందోళన చేస్తున్న మమత

భువనగిరిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో చదువుకుంటూ వ్యాపారం చేస్తున్నానని నమ్మించి వివాహం చేసుకున్న భర్త పట్టించుకోకపోవటంతో భార్య అత్తింటిముందు బైఠాయించింది. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. కామారెడ్డి జిల్లాకు చెందిన బంటారం నాగయ్య, మంగ దంపతులు హైదరాబాద్‌లోని దమ్మాయిగూడలో స్థిరపడ్డారు. వీరికి కుమార్తె మమత, కుమారుడు ఉన్నారు. డిగ్రీ పూర్తయిన కుమార్తెకు వివాహం చేయాలని నిర్ణయించుకుని ఆమె ఫొటో సహా వివరాలను 2023 సెప్టెంబరులో ఓ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో పోస్టుచేశారు. అదే సమయంలో భువనగిరికి చెందిన వస్త్రవ్యాపారి లెంకలపల్లి సురేష్ తన కుమారుడికి వివాహం చేసేందుకు అదే మ్యాట్రిమోనీలో వివరాలు పోస్టు చేశాడు. ఈ క్రమంలో వస్త్ర వ్యాపారి కుమారుడు మణిదీప్ ఆ యువతితో మాటలు కలిపి నీవు మా కుటుంబ సభ్యులందరికీ నచ్చావ్, నేను అమెరికాలో చదువుకుంటూ వ్యాపారం చేస్తున్నానని, నమ్మబలికి పెళ్లికి ఒప్పించాడు. దీంతో ఇరు కుటుంబాల అంగీకారంతో వరకట్నం చెల్లింపులతో 2023 డిసెంబరు 9న హైదరాబాద్‌లో సంప్రదాయరీతిలో కులాంతర వివాహం జరిగింది. మరుసటి రోజు భువనగిరిలో వివాహ విందు కూడా నిర్వహించారు. వివాహమైన 10 రోజులకు మణిదీప్ అమెరికాలోని టెక్సాస్‌కు వెళ్లిపోయాడు. త్వరలోనే అమెరికాకు తీసుకువెళ్తానని భార్య మమతకు చెప్పాడు. కానీ అక్కడికి వెళ్లాక భార్య ఫోన్ కాల్స్, చాటింగ్‌కు స్పందించలేదు. దీంతో వధువు అత్తింటికి ఫోన్ చేసినప్పటికీ స్పందన కరువైంది.

### భర్త కోసం అమెరికాకు పయనం..

వివాహానికి ముందే మమతకు అమెరికా వీసా ఉండటంతో, మణిదీప్ చెప్పిన చిరునామా ఆధారంగా గత ఏడాది నవంబరు 4వ తేదీన మమత అమెరికా వెళ్లింది. ఆమె వస్తున్న సమాచారం తెలుసుకున్న మణిదీప్ భార్యను విమానాశ్రయంలో కలుసుకుని ఐదుగురు మిత్రులతో కలసి ఉంటున్న సింగిల్ బెడ్‌రూమ్ ఇంటికి తీసుకెళ్లాడు. అందరూ కలసి ఇదే ఇంటిలో ఉండాలంటూ ఒత్తిడి చేశాడు. కొద్ది రోజుల అనంతరం మిత్రులు వెళ్లిపోవడంతో దంపతులిద్దరూ ఉన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో సతమతం

అమెరికాలో ఉంటున్న మమత దంపతులకు ఎదురైన ఆర్థికఇబ్బందులతో ఆమె అక్కడికి సమీపంలోని ఓ తెలుగు కుటుంబం ఇంటిలో పనికి కుదిరింది. ఈ నేపథ్యంలో తొమ్మిది నెలల పాటు చేసిన పనికి వచ్చే వేతనం తనకే ఇవ్వాలంటూ భర్త గొడవపడేవాడు. ఇదిలా ఉండగా అక్కడి లేబర్ యాక్ట్ ప్రకారం ఆరు నెలలకు ఒకసారి ఇచ్చే 20రోజుల సెలవులు లభించాయి. దీంతో మమత ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన హైదరాబాద్‌కు వచ్చింది. తిరిగి వెళ్లేందుకు 15రోజుల అనంతరం భర్తకు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందన రాలేదు. దీంతో అక్కడి అతడి మిత్రులకు ఫోన్ చేయగా మమత హైదారాబాద్ వెళ్లిన మరుసటి రోజే మణిదీప్ భువనగిరి వెళ్లాడని చెప్పారు. ఆమె అత్తింటికి ఫోన్ చేయగా డిప్రెషన్‌తో అనారోగ్యానికి గురై ఇంటికి వచ్చాడని చెప్పారు.

### అత్తారింటికి వెళ్లినా...

భర్త మణిదీప్ భువనగిరికి వచ్చాడని తెలుసుకున్న మమత తల్లి, సోదరుడితో కలిసి అత్తారింటికి వెళ్లింది. అయితే వారు ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. పైగా నీవు మాకు నచ్చలేదు విడాకులు తీసుకుందామన్నారు. దీంతో ఆమె మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మహిళా పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కౌన్సిలింగ్‌కు రమ్మని అక్కడి పోలీసులు సమాచారం ఇచ్చినప్పటికీ భర్త కుటుంబం నిర్లక్ష్యం చూపింది. ఈ క్రమంలో నాలుగైదు పర్యాయాలు ఆమె భువనగిరికి వచ్చి అవమానాలకు, ఛీత్కారాలకు గురైంది. అలాగే ఇరు కుటుంబాల పెద్దమనుషులతో పలుమార్లు పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో ఆమె తనకు భర్త కావాలంటూ కుటుంబసభ్యులతో కలిసి అత్తింటి ముందు బుధవారం రోజంతా బైఠాయించింది. అయితే కోడలు మమత చెప్పేదంతా అబద్ధాలు అని, తమ పరువు తీసేందుకు చేసిన పన్నాగమని, ఆమెనే ఇష్టపడి పెళ్లి చేసుకున్నా విడిపోయేందుకు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారని అత్తింటి వారు ఆరోపిస్తున్నారు. అయితే దసరా అనంతరం ఇరు కుటుంబాలతో మాట్లాడుతామని పోలీసులు నచ్చచెప్పడంతో రాత్రి పొద్దుపోయాక ఆందోళనను విరమించారు.

### వివాహానికి భారీగా కట్నం

మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో నచ్చి కుదుర్చుకున్న కులాంతర వివాహానికి భారీగా కట్నం ఇచ్చినట్లు మమత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. వివాహ సమయంలో వరకట్నంగా వధువుకు 25తులాలు, వరుడికి 8తులాలు బంగారం, 4.50కిలోల వెండి, రూ.10లక్షలు ఇచ్చామని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కామారెడ్డిలో భూవిక్రయంతో వచ్చిన నగదులో రెండు దఫాలుగా రూ.5లక్షల చొప్పున రూ.10లక్షలు చేబదులుగా అల్లుడి కుటుంబం తీసుకుందని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అంటున్నారు.

## నిజాయితీ చాటుకున్న పెట్రోల్ బంకు సిబ్బంది



బాధితుడికి బ్యాగ్‌ను అందజేస్తున్న పోలీసులు, బంకు మేనేజర్, సిబ్బంది

హాలియా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంక్‌లో దొరికిన రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు కలిగిన బ్యాగ్‌ను పోలీసులకు అందజేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా హాలియాలో బుధవారం జరిగింది. ఏఎస్‌ఐ యాదయ్య, బంక్ మేనేజర్ పోషబోయిన లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తవిటి బ్రహ్మచారి పెట్రోల్‌బంక్‌లోకి ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోయించుకున్నాడు. అనంతరం బంక్‌లో ఉన్న గాలి మిషన్‌లో గాలి చెక్‌చేసుకునే సందర్భంలో బైక్‌పై ఉన్న బ్యాగ్‌ను పక్కన పెట్టి వెళ్లిపోయాడు. అది గమనించిన సిబ్బంది బ్యాగ్‌ను మేనేజర్ లింగయ్యకు అప్పగించగా వారు బ్యాగులో ఉన్న వివరాల ఆధారంగా బ్రహ్మచారిని అని గుర్తించి విషయాన్ని హాలియా పోలీసులు తెలిపారు. బుధవారం పోలీస్ సమక్షంలో రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాల గల బ్యాగ్‌ను బ్రహ్మచారికి అందజేశారు. దీంతో బ్రహ్మచారి వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ చాటుకున్న బంకు మేనేజర్ లింగయ్య, సిబ్బందిని పోలీసులు, పుర్రప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో మండలి చినలింగయ్య, రాంబాబు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం

గరిడేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారంరాత్రి ఓ బేకరి దుకాణం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు భూక్యా నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం గడ్డిపల్లి గ్రామంలో పదేళ్లుగా నాగరాజు బేకరి దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగా దుకాణం మంగళవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. 12గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు తెలపడంతో షట్టర్ తీసి చూసే సరికి మొత్తం దుకాణం దగ్ధమైంది. ప్రమాదంలో ఫర్నీచర్‌తో పాటు తినుబండారాలు, కాలిపోయి సుమారు రూ.5లక్షల విలువైన నష్టం వాటిల్లినట్లు నాగరాజు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

## పల్లె ప్రకృతి వనం బోర్డు చోరీ



ప్రకృతి వనంలోని ఆర్చిచోరీ కోసం స్తంభాలను కోసిన దొంగలు (రౌండప్‌లో)

దామరచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని రాజగట్టు గ్రామంలో పల్లె ప్రకృతివనం బోర్డు బుధవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. వనంలోని ఇనుపపైపులతో ఏర్పాటుచేసిన బోర్డును బ్లేడ్ సహాయంతో కట్ చేసి మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లనట్లు గ్రామస్థులు తెలిపారు.అధికారులు స్పందించి చోరీకి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుని పల్లె ప్రకృతి వనానికి పూర్తిస్థాయిలో రక్షణ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

## బైరవునిబండలో శతాధిక వృద్ధురాలు మృతి



రామక్క(ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బైరవునిబండ గ్రామంలో 103 ఏళ్ల శతాధిక వృద్ధురాలు ఈదులకంటి రామక్క అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దకుమారుడు చనిపోగా, చిన్నకుమారుడు గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రామక్కకు 15మంది మనుమళ్లు, మనుమరాళ్లు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన యేసు

గరిడేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని కోదాడ, మిర్యాలగూడ ప్రధానరహదారిపై గుండా లక్ష్మమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద ఎలగోల యేసుకు ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. యేసు స్పృహ కోల్పోగా వెంటనే స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. యేసు జీవనాధారం కోసం గరిడేపల్లిలో బస్తాల కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అర్వపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెల రోజుల కిందట సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామానికి చెందిన ఉప్పల అనిల్(30) ట్రాక్టర్ ఢీకొని గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

## ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

కనగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామశివారు వ్యవసాయ భూముల్లో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.26,300 నగదును. 8 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోళ్ల పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు కొనసాగించే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో పీసీలు మజీద్, లింగరాజు, సురేష్ తదితరులున్నారు.

## గొర్రెల దొంగల ముఠా పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొర్రెల దొంగల ముఠాను పట్టుకున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు. బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వంగపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కమాన్ సమీపంలో తనతో పాటుగా ఎస్‌ఐలు యాదయ్య, కృష్ణస్వామి సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా కరీంనగర్ జిల్లా కేశపట్నం గ్రామానికి చెందిన గొల్లెన కుమార్ అలియాస్ కుమారస్వామి, కింసారపు శేఖర్ అలియాస్ ఎండి అబ్దుల్‌రహన్‌లు మల్లాపురం గ్రామానికి చెందిన మోటే రమేష్ గొర్రెలను అపహరించి రెండు కార్లలో తరలిస్తున్నారు. అనుమానంతో పట్టుకొని వారి ప్రశ్నించగా సరైన సమాధానం లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని వివరించారు. వారి వద్ద నుంచి 15 గొర్రెలు, రెండు కార్లు స్వాధీనం పర్చుకొని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి వారిని రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## మెగా పేరెంట్స్ మీటింగ్ రేపు

నాంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాంపల్లి ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఈ నెల 26న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంధం మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# అన్నపూర్ణాదేవిగా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని రోజుకో విధంగా పూజిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.



వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెంలో..



మఠంపల్లిలో..



చిట్యాల మండలంలో..



రామన్నపేట మండలం ఎల్లంకిలో..




దేవరకొండలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

## యాదగిరిగుట్ట ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రవినాయక్



యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా గుగులోత్ రవినాయక్‌కు ప్రభుత్వం బుధవారం బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఈవో ఎస్.వెంకట్రావ్ వ్యక్తిగత పనుల నిమిత్తం నెల రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళుతున్నారు. గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రవినాయక్ పనిచేశారు.

## విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ఐడీఎల్ యాజమాన్యం

మేళ్లచెర్వు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 35వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించిన స్కూల్ యాజమాన్యం. ఈ నెల 25, 26, 27తేదీల్లో నిజామాబాద్ జిల్లా ముక్తల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు మండల కేంద్రంలోని ఐడీఎల్ హైస్కూల్‌కు చెందిన రోహిణి, కార్తిక, ఈ నెల 19వ తేదీ నుంచి 23వరకు కోదాడలో నిర్వహించిన క్యాంపులో ఉత్తమ ప్రదర్శన కనబర్చి సూర్యాపేట జిల్లా తరపున ఎంపికైనందున పాఠశాల కరస్పాండెంట్ రమణకుమార్ ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు బసవయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్ అభినందించారు.

● జీతం రాలే!

# పండుగ చేసుకునేదెలా?

● ఉపాధి వేతనాల కోసం కూలీల నిరీక్షణ ● ఉమ్మడి జిల్లాలో రూ.86కోట్ల వేతన బకాయిలు ● మూడునెలలుగా పెండింగ్‌లో ఎఫ్‌ఏల వేతనాలు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే నెల నుంచి జూలై నెలాఖరు వరకు కూలీల దినసరి వేతనాల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దాదాపు 12 లక్షల మంది కూలీలు తమ వేతనాలకోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించే ఉద్దేశంతో అమల్లోకి వచ్చిన ఉపాధిహామీ పథకం ద్వారా వేతనాల చెల్లింపు ప్రక్రియ ఏటా గాడి తప్పుతోంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)లో నమోదైన కూలీల హాజరు నమోదు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పూర్తవుతున్నా సకాలంలో కూలీలకు వేతనాలు అందని దుస్థితి నెలకొంది. ఉద్యోగ సిబ్బంది సైతం వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. నిత్యం కూలీలతో మమేకమై పనులు కల్పించే ఫీల్డ్‌అసిస్టెంట్లకు మూడు నెలల వేతనాలు అందాల్సి ఉండగా, మండలస్థాయిలో పనిచేసే ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు(సీవో), ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండు నెలల జీతభత్యాల చెల్లింపు ప్రక్రియ స్తంభించింది.

### ఎన్నికల కోడ్ భయం

ఇప్పటికే ఐదునెలలుగా పెండింగ్‌లోపడిన దినసరి వేతనాలు ఎప్పటికీ వస్తాయోనన్న ఆందోళన గ్రామీణ ప్రాంత కూలీలతో పాటు, క్షేత్ర సహాయకుల్లో కనిపిస్తోంది. ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీల్లో అధికశాతం నిరక్షరాస్యులు కావడంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక పడిగాపులు కాస్తున్నారు. కార్యాలయాలు, గ్రామాల్లో అందుబాటులో ఉండే సిబ్బందిని ప్రశ్నిస్తున్నప్పటికీ వారు సైతం దీనిపై స్పష్టత ఇవ్వలేక చేతులెత్తేస్తున్నారు. ఈనేపథ్యంలో కూలీలు తమ సమస్య పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్లాలో.. ఎవరిని అడగాలో తెలియక మదనపడుతున్నారు. అయితే గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది కూలీల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. జూలై నెలాఖరు వరకు గ్రామాల్లో వ్యవసాయ పనులు సక్రమంగా దొరక్కపోవడంతో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు సైతం ఉపాధి హామీ పథకాన్ని ఆదరించారు. ఈ నేపథ్యంలో ఈ పథకం వినియోగం పెరిగి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య అధికమైంది. దీంతో ప్రతీ గ్రామ బడ్జెట్‌లో 80 నుంచి 90 శాతం పనులు సైతం ఇప్పటికే పూర్తయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే తమ వేతనాల పరిస్థితి ఏమిటని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

### రూ.86 కోట్ల వేతన బకాయిలు

ఉమ్మడి జిల్లాలో 8,78,659 కుటుంబాలు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. ఆయా కుటుంబాలనుంచి 19,77,973మంది కూలీలుగా నమోదై ఉంటే 10,06,078 మంది పురుషులు, 9,71,895 మంది మహిళా కూలీలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకాన్ని 11.08లక్షల మంది కూలీలు ఆదరించారు. పనులకు హాజరైన కూలీలకు ఈ ఏడాది మేనుంచి జూలై మాసాంతం వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఒక్కో కూలీకి సగటున ఏడునుంచి తొమ్మిది వారాల కష్టార్జితం పెండింగ్‌లో పడ్డాయి. మండుటెండలో చెమటోడ్చిన కూలీల వేతనాల చెల్లింపు ప్రక్రియలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. ఇప్పటికే జిల్లాల్లో పనిదినాల వినియోగం తుదిదశకు చేరుకున్నప్పటికీ వేతనాలు మాత్రం పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో రూ.86కోట్ల పైచిలుకు వేతనాలు కూలీలకు అందాల్సి ఉంది. అందులో నల్లగొండ జిల్లాలో పనిచేసిన 5,12,082 మంది కూలీలకు రూ.38 కోట్లు బిల్లులు జమచేయాల్సి ఉండగా, అందులో రూ.7.68కోట్ల నిధులు, ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) స్థాయిలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా సూర్యాపేట జిల్లానుంచి 3,94,818 మందికూలీలు ఉపాధి పనులకు హాజరుకాగా, రూ.27కోట్ల పైచిలుకు వేతన బకాయిలు ఉన్నాయి. అందులో రూ.2.67కోట్ల బిల్లుల చెల్లింపు ఎఫ్‌టీవో స్థాయిలోనే నిలిచిపోయాయి. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధిహామీ పనులు చేసిన 2,01,953 మంది కూలీలకు చెందిన రూ.21కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రూ.1.36కోట్ల బిల్లులు ప్రస్తుతం ఎఫ్‌టీవో పెడింగ్‌లో ఉన్నాయి. ఈజీఎస్ పథకానికి నిధుల విడుదల సరిపడా స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే వేతనబకాయిలు నెలలతరబడి పెండింగ్‌లో పడుతున్నాయని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



### పండగ పూట పస్తులే

మర్రిగూడ, అడ్డగూడూరు: సాధారణంగా ఒక నెల జీతం రాలేదంటే ఉద్యోగులు ఇబ్బంది పడతారు. అదే మూడు నెలలపైగా రాలేదంటే వారి ఇబ్బందులు వర్ణనాతీతం. మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీల పరిధిలో 80 మంది (మల్టీ పర్పస్ వర్కర్స్‌గా, టెంపరరీ వర్కర్స్) పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, జీతాలు రాక జీవనం సాగేదెలా? అని పండుగకు వస్తలే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగూడూరు మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 84 మంది మల్టీపర్పస్ కార్మికులుగా పని చేస్తున్నారు. ప్రసుత్తం గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.9,500 చెల్లిస్తున్నారు. ఈ వేతనాన్ని సకాలంలో ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు అవస్థలు పడుతున్నారని వారు అవేదన వ్యక్తం చేశారు.

**తొమ్మిది వారాల కూలీ డబ్బులు రావాలి**



ఈ ఏడాది మార్చి నుంచి ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లాం. ఏప్రిల్ నెలాఖరు వరకు వేతనాలు చెల్లించి ఆ తర్వాత నిలిపివేశారు. మాకు రావాల్సిన దినసరి వేతనాల గురించి ఈజీఎస్ సిబ్బంది, అధికారులను అడిగితే సరైన సమాధానం రావడంలేదు. రెండువారాలకోసారి వచ్చే వేతనాలు ఐదునెలలైనా కూలీల ఖాతాలో జమకావడంలేదు. పోస్టాఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరిగి ఆరాతీసి నిరీక్షిస్తున్నాం.

గోళ్ల నాగరాజు, వేములపల్లి

## పేదింటి బిడ్డకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న షేక్ షన్ను

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డకు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం లభించింది. గుడిపల్లి మండలకేంద్రానికి చెందిన షేక్ షన్ను నిఫా (ఎన్ఐఎఫ్ఏఏ- నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ ఆక్టివిస్ట్) జాతీయ స్థాయి పురస్కారం అందుకుంది. మంగళవారం ఢిల్లీలోని భారత మడపంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధిపతి ప్రీత్‌పాల్ సింగ్ షేక్ షన్నుకు అవార్డు అందజేశారు. గత కొన్నేళ్లుగా సమాజ సేవలో నిబద్ధతతో పని చేస్తూ వచ్చిన ఆమెకు ఈ గౌరవం దక్కింది. కాగా షేక్ షన్ను నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్)లో భాగంగా 2024 భారతదేశ రిపబ్లిక్ డే సెలెబ్రెషన్స్‌లో పాల్గొని కర్తవ్య పత్ దగ్గర కవాతు చేసి ఎంతో మంది ఆడపిల్లలకు మనోధైర్యాన్ని నింపింది. షన్నుకు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కిన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, తల్లి షేక్ హసీనా, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

### జాతీయస్థాయి పోటీలకు నల్లగొండ క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం దిండిగల్ పట్టణంలోని క్రీడా మైదానంలో ఈనెల 25నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే 77వ సీనియర్, 44వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు తెలంగాణ జట్టుకు నల్లగొండ జిల్లా నుంచి ఆర్, భవ్యశ్రీ(సీనియర్), ఆర్.శృతి, జస్వంత్, పి.చిన్ని ఎంపికయ్యారని బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బుధవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. వీరిని పలువురు అభినందించారు.

## సిమెంట్ నాణ్యతలో మైహోమ్‌కు బంగారు పతకాలు



అవార్డు అందుకుంటున్న మైహోమ్ ప్రతినిధులు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సిమెంట్ తయారీలో నాణ్యత పటిష్ఠత విభాగంలో మైహోమ్ సంస్థకు రెండు బంగారు పతకాలు వచ్చాయని సంస్థ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం భారత ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సిమెంట్ పరిశ్రమల్లో క్వాలిటీ విభాగంలో పనిచేస్తున్న భారత ప్రభుత్వ అనుబంధ సంస్థ క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సిమెంట్ నాణ్యత పటిష్ఠతపై అవగాహన పోటీ నిర్వహించగా.. ఈ పోటీల్లో పాల్గొన్న మైహోమ్ క్వాలిటీ విభాగం ఉద్యోగుల ఉత్తమ ప్రదర్శనకు మైహోమ్ సంస్థకు రెండు అవార్డులు వచ్చాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## పేట మార్కెట్‌లో పెసర క్వింటాకు రూ.9188



పెసర్లను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి

భానుపురి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పెసర క్వింటాకు రూ.9188 ధర పలికిందని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లోకి మాడుగుల నవీన్, పెన్‌పహాడ్ మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గుండు ఉమారెడ్డి క్వింటా పెసర్లు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ధరలు జాతీయ స్థాయి మార్కెట్ల కంటే అధిక ధరలు ఇస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి ఫసియోద్దిన్, వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, డైరెక్టర్లు మాడుగుల నవీన్, ధరావత్ వీరన్న, దాసరి తిరుమలరావు, ఉప్పల సత్యనారాయణ, పచ్చిపాల వెంకన్న, అబ్దుల్ ఖరీం, ఆర్తికేశవులు ఉన్నారు.

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



యాదగిరిగుట్టలో ఉత్సవమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. కాగా, అనుబంధ శివాలయంలో దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని గురువారం చేపట్టనున్న గిరిప్రదక్షిణలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునిత, టీస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొననున్నారు.

### పశ్చిమ రాజగోపురం నుంచి భక్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులు బుధవారం నుండి పశ్చిమ రాజగోపురం నుంచి ఆలయం వెలుపలికి వచ్చేందుకు అధికారులు అనుమతించారు.

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో లక్ష్మీ నరసింహుడి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

## ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థికి గోల్డ్‌మెడల్




విద్యార్థి కుర్రి ప్రవీణ్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి కుర్రి ప్రవీణ్ అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. బుధవారం ఏపీలోని గుంటూరులో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సౌత్ జోన్ 36వ నేషనల్ ట్రయాథ్లాన్ అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్స్, లాంగ్‌జంప్, బ్యాక్‌త్రోలో గోల్డ్‌మెడల్ సాధించాడు. దీంతో గోల్డ్‌మెడల్ సాధించిన ప్రవీణ్‌ను ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, పీడీ అంజనేయులు, పీఈటీ రాములు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు. ఇదిలా ఉండగా గత ఏడాది గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 35వ సౌత్‌జోన్‌లో సిల్వర్ మెడల్ సాధించగా, 36వ సౌత్‌జోన్‌లో గోల్డ్ మెడల్ పొందడం గమనార్హం. అదేవిధంగా గత ఏడాది జాతీయ స్థాయిలో జార్ఖండ్‌లోని రాంచీలో నేషనల్ అథ్లెటిక్స్ 100 మీటర్ల షాట్ రన్‌లో నేషనల్ రికార్డులో గోల్డ్‌మెడల్ సాధించాడు.

## యూరియా కోసం బారులు



మోతె మండలం సర్వారం సొసైటీ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

మోతె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోతె మండలానికి వారం రోజులుగా ఏ కేంద్రానికి యూరియా రాకపోవడంతో రైతులు అధిక ధరలకు పక్క మండలాల్లో కొనుగోలు చేస్తున్నారు. బుధవారం మోతె మండలం సర్వారం సొసైటీకి యూరియా లోడ్ వచ్చింది లోడ్ వచ్చినా సొసైటీ, వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు వరుసల లైన్‌కట్టించి, ఒక్కొక్కరికి ఒక్కో బస్తాను అందజేశారు. లోడ్ మాత్రమే రావడంతో వెనక లైన్‌లో ఉన్న సుమారు 500 మందికి యూరియా అందలేదు. మోతె గ్రోమోర్, సిరికొండ సొసైటీ, సర్వారం సొసైటీల ఆధ్వర్యంలో యూరియా అందించాల్సి ఉన్నా వారం రోజులుగా రాకపోవడంతో రైతులు ఆందోళనచెందుతున్నారు.

## ఎండ.. వాన.. బతుకమ్మ



ఈ నెల 21న.. భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఈ నెల 21న.. వానకు తడుస్తూ..



ఈ నెల 24న.. ఎండకు ఎండుతూ...

ఎంగిలిపూలతో ప్రారంభమైన బతుకమ్మ ఆడిపాడి నిమజ్జనం చేయకుండా అక్కడే వదిలి వెళ్లారు. అయితే రోజువారీగా భువనగిరి మునిసిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే ఆడిపాడి బతుకమ్మను ప్రతీరోజు నిమజ్జనం చేయకుండానే అక్కడే మైదానంలో వదిలివేయడంతో నాలుగు రోజులుగా ఎండకు ఎండి... వానకు తడుస్తూ ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు బతుకమ్మలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రి

### బతుకమ్మ కవి సమ్మేళనంలో నల్లగొండ కవులు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బతుకమ్మ కవి సమ్మేళనంలో నల్లగొండకు చెందిన కవులు డాక్టర్ బెల్లి యాదయ్య, అంబటి వెంకన్న, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, గద్దం శ్రీను, ప్రవీణ, భానులు పాల్గొని తమ కవితలతో శ్రోతలను అలరింపజేశారు. అనంతరం రాష్ట్ర సాంస్కృతిక శాఖ కవులను ఘనంగా సన్మానించింది.

### తహసీల్దార్‌గా వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ



శాలిగౌరారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం తహసీల్దార్ జమీరుద్దీన్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డీటీగా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ బుధవారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని వరప్రసాద్ కోరారు.

# అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని దేవాలయాల్లో చిట్యాల మండలంలోని గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండలంలోని నేరడలో శ్రీమహమ్మాయి శ్రీశాంభవీ



నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో దీక్షదారులకు అన్నదానం చేస్తున్న భక్తులు

దేవి ఆలయంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రోత్సావాల్లో ప్రాతఃకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు ఆలయానికి పెద్దఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ఆయుఃరారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

నల్లగొండ కల్చరల్: పట్టణంలో పలు మండపాల్లో అర్చకులు అమ్మవారిని పసుపు వస్త్రం, చామంతిపూలతో అలంకరించి, కట్టె పొంగళిని నైవేద్యంగా సమర్పించారు. దీంతో అమ్మవారి మండపాలన్నీ భక్తులతో సందడి చేశాయి. మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి వీటీ కాలనీ, యాటకన్నారెడ్డి కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాలోన్ని మండపాల్లో జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసారు. చైర్మన్‌చీదేటి వెంకటరెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో భక్తుల రద్దికి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. కనగల్ ఎక్స్‌రోడ్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయ మండపం వద్ద ఏటెల్లి సైదులు-దనమ్మ దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

మునుగోడు : మునుగోడులోదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో పలు ఆలయాల్లో దర్శనమిచ్చారు. స్థానిక దుర్గామాత ఆలయంలో పురోహితులు శ్రీనివాస్, శేఖర్‌లు సంయుక్త మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ వ్యాపారి సోమ వారం శ్రీహరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు అనంతరం మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాలిగౌరారం : కనకదుర్గ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శాలి



మునుగోడులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పద్మావతి కాలనీలో అన్నప్రసాద వితరణ చేస్తున్న మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, కాలనీ పెద్దలు

గౌరారం మండలం వల్లాలలో మూడో రోజు అన్నపూర్ణాదేవి అవతారంలో అన్న ప్రసాద వితరణ శ్రీ శివసాయి రైస్ ఇండస్ట్రీస్ చెరువు అన్నారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వావిలాల రామలింగయ్య శర్మ, శివసాయి రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్స్ కన్మంతరెడ్డి, కేశవరెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ బొడిగ వెంకటేశ్వర్లు గౌడ్, మాజీ ఎంపీటీసీ మాదగోని కవిత రామలింగయ్య గౌడ్, శివదుర్గ కమిటీ సభ్యులు, భవాని భక్తులు మాదగోని రాములు, గురుస్వామి, వెంకటరాములు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని మాంద్ర దారిలో ఉన్న శివాలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాద వెంకన్న సునీత దంపతులు అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాల్లో దూదిమెట్ల సత్తయ్య, దోసపాటి విష్ణు, పబ్బతి శేఖర్, యాద సచిన్, బండారు రమేశ్, దోసపాటి వేణు, గడగోజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలో అమ్మవారి దేవాలయం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గకు భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మహిళాభక్తులు ధూప దీప నైవేద్యాలను సమర్పించి కనుల పండుగగా పూజలు నిర్వహించుకున్నారు.

## రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 4గంటలకు ఎన్‌జీ కళాశాల మైదానంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్లు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పీట్టల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నల్లగొండలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించుకునే ఆడపడుచుల బతుకమ్మ వేడుకలకు మహిళలంతా కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బతుకమ్మ పూజ, బతుకమ్మ ఆట, కోలాటం వంటి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంఘం నాయకులు కొట్టం మధుసూదన్‌రెడ్డి, గుజ్జ జగన్మోహన్‌రెడ్డి, అలుగుబెల్లి రాంరెడ్డి, అనిల్‌రెడ్డి, సైదిరెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## రసాయనిక ఎరువులను తగ్గించాలి



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఏవీ రామాంజనేయులు

మర్రిగూడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ పచ్చిరొట్టే ఎరువులు వాడితే భూమి సారవంతమై ఎరువుల వినియోగం తగ్గించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ ఏవీ రామాంజనేయులు అన్నారు. మండలంలోని వట్టిపల్లి, మర్రిగూడ గ్రామాల్లో బుధవారం వరి పంట పొలాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కెఎన్ఎం1638 రకంలో సాగులో మెళకువలు, యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యలపై, అలాగే పచ్చరొట్ట ఎరువులైన జనుము, జీలుగా, కానుగ, వేప, సుబాబులు ఆకులను దుక్కిలో వెదజల్లడం, దున్నడం వల్ల భూమి సారవంతమై ఎరువుల వినియోగం తగ్గించవచ్చని సూచించారు. పంటలో సేంద్రియ, పచ్చిరొట్టె ఎరువులను వాడితే భూసాంద్రత పెరిగి నీటి నిల్వ ఉండి శక్తి కలిగి అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో వరికి ఆకు చుట్టు పురుగు సుడిదోమ, అగ్గి తెగులు, ఆకుముడత సోకుతుందని తెలిపారు. నివారించేందుకు వేప నూనెను లీటర్ నీళ్లలో, అదేవిధంగా ఆవు మూత్రం 10ఎంఎల్‌లో రెండు లీటర్లు నీరు కలిపి స్ప్రే చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో వ్యవసాయ అధికారి సహాస్, ఏఈవో విజయ్‌కుమార్, రైతులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

మునుగోడురూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన మేడి యాదగిరి, అదే గ్రామానికి చెందిన పోగుల సుభాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇరువురి కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున రూ.20వేల నగదును ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పంపించారు. ఆ నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడింపల్లి యాదగిరి, మేడి నాగలక్ష్మి, యాదయ్య, నిమ్మల స్వామి, బీమగోని స్వామి, మాదగోని దేవలోకం, బొడ్డుపల్లి సత్తయ్య, బోయపల్లి శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

**మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం**

చిట్యాలరూరల్: మండలంలోని వెలిమినేడుకు చెందిన మంకాల గోపాల్ ఇటీవల మృతిచెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అంతటి నర్సింహగౌడ్ హాజరై మృతుని చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో మాదగోని యాదయ్య, మంకాల లింగయ్య, చీమల వీరేశం, టేకుల అంజిరెడ్డి, కాటం సత్తయ్య, చింతకింది వెంకటేష్, చిరగోని నర్సింహ, జనగాం సత్యనారాయణ, అంశల శ్రవణ్, మల్లేష్, యాదయ్య, సురేష్, జంగయ్య, మహేష్, నర్సింహ పాల్గొన్నారు.

## త్రిపుల్‌ఆర్ బాధితులకు నష్టపరిహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మర్రిగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు వల్ల భూము లు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారం అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బచ్చు రామకృష్ణ డిమాండ్ చేశారు. మర్రిగూడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్డు కో సం రైతుల భూములను బలవంతంగా తీసుకోకుండా వారితో సంప్రదించి వారి అనుమతితోనే అలైన్‌మెంట్ కోసం భూములు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయంను నమ్ముకొని జీవిస్తున్న రైతులు ఈ రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు వల్ల మర్రిగూడ, బట్లపల్లి, వట్టిపల్లి, భీమనపల్లి, తానేదారుపల్లి, సరంపేట, ఇందుర్తి గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారన్నారు. ఈ రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మూడు వంతులు నష్టపరిహారంతో పాటు భూమికి భూమి లేదా ప్రతి ఇంటికి ఉద్యోగం, కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గంట రవి, యాదగిరి, రైతు చెరుకు శ్రీరాములు, మనోహర్, వెంకట్రాం, సత్తయ్య, రమేష్ పాల్గొన్నారు.


## మంచినీటి సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చిట్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని పదో వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ కిసాన్ సెల్ మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో వార్డు మహిళలు మునిసిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. మిషన్‌కాకతీయ నీళ్ల రావడం లేదని, లోకల్ వాటర్ కూడా రావడం లేదని తెలిపారు. నీళ్ల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పల్లపు చంద్రకళ, సౌమ్య, లక్ష్మి, జయమ్మ, కవిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని అభివృద్ధి చేశామనడం విడ్డూరం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ వెంకటేశం

గట్టుప్పల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నూతన మండలంగా ఏర్పడిన గట్టుప్పల మండలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి చేశామని కాంగ్రెస్ నాయకులు అనడం విడ్డూరంగా ఉందని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల మండలానికి ఇప్పటి వరకు ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి వాటిలో ఎన్ని పూర్తయ్యాయనే కనీస సమాచారం లేకుండా, అవగాహన లేకుండా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేస్తానని అన్నారు. అన్ని బీఆర్ఎస్ హయాంలోనే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి అశోక్, పోరెడ్డి ముత్తిరెడ్డి, తోటకూర శంకర్, గొరిగె సత్తయ్య, అవ్వారి శ్రీనివాస్, హనుమంతు పాల్గొన్నారు.

# పిల్లలు పోషకాహారం తీసుకోవాలి

మునుగోడురూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లలు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ వై.ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఇప్పర్తి గ్రామంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం, ఆహారపు అలవాట్లు పలు విషయాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. శామ్, మామ్ పిల్లలకు బాలామృతం ప్లేస్ పెట్టి క్వాంటిటీ గురించి అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ మెటీరియల్, కిచెన్ గార్డెన్ గురించి అందుబాటులో ఉన్న పోషక విలువలు కలిగిన తక్కువ ఖర్చుతో వచ్చే పోషకాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పద్మ పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త కమల, అంగన్‌వాడీ హెల్పర్, బాలింతలు పాల్గొన్నారు.



పోషకాహారం గురించి అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**చిన్నారులకు సమతుల ఆహారం అందించాలి**

నార్కట్‌పల్లి: ఎదిగే చిన్నారులకు సమతుల ఆహారం అందించాలని నార్కట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. పోషణమాసంలో భాగంగా బుధవారం నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో ఐదేళ్లలోపు చిన్నారులకు వారి ఎత్తుకు తగ్గ బరువును పరీక్షించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తివిద్య కోర్సులతో స్థిరపడవచ్చు

కేతేపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల యువత జీవితంలో స్థిరపడే వీలుందని కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మమత అన్నారు. దసరా సెలవుల్లో ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు 35మందికి వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో 10రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. కోర్సుల్లో భాగంగా నకిరేకల్‌లోని రిలయన్స్ ట్రెండ్స్ షోరూంలు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరమైన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మమత విద్యార్థులతో మాట్లాడుతూ వృత్తి విద్యను అలవర్చుకోవడంతో అవసరమైనప్పుడు ఆయా కోర్సులను వృత్తిగా ఎంచుకుని జీవనం సాగించవచ్చని అన్నారు. 10రోజుల శిక్షణలో విద్యార్థులు టైలరింగ్, వైద్య మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్లు హిమబిందు, జ్యోత్స్న, పాఠశాల ఉపాధ్యాయులు రాజారమేష్ పాల్గొన్నారు.



నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను నేర్చుకుంటున్న కేతేపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

**వృత్తివిద్య శిక్షణతో నైపుణ్యత**

శాలిగౌరారం: వృత్తి విద్య నేర్చుకునే విద్యార్థులకు నైపుణ్యత పెంపొందే అవకాశం ఉందని తెలంగాణ మోడల్ స్కూల్ వల్లాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. దసరా సెలవుల్లో భాగంగా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో, కిరణ్ ఫ్లెక్స్, సిరి డిజిటల్ స్టూడియో ఆధ్వర్యంలో తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల వల్లాల విద్యార్థులకు వృత్తి విద్యపై పది రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నెట్‌షిప్ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్య నేర్చుకునే విద్యార్థులకు సాధారణ పాఠశాల రోజులతో పాటు సెలవు దినాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వృత్యంతర శిక్షణ అందించి అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులు సెలవుల్లోని సమయాన్ని శిక్షణ కోసం కేటాయించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ వేణు, సువర్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మఖానా మొలకెత్తలే!


(5వ పేజీ తరువాయి)


నేపథ్యంలో ఆ రాష్ట్రంలో మాదిరిగానే జిల్లా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు నీరున్న ప్రాంతంలో వీటి సాగుకు నిర్ణయించి ఆ వైపుగా అడుగులు వేశారు. ఈ పంట చేతికి వచ్చేందుకు సుమారు ఎనిమిది నెలల సమయం పడుతుంది. ఐదు కిలోల విత్తనాలతో పంట సాగు చేస్తే 600కిలోల వరకు మఖానా దిగుబడి వస్తుంది. మఖానా ఉత్పత్తులకు అధిక ధరలు ఉన్నాయి. 100గ్రాముల మఖానాకు రూ.300 వరకు ధర ఉంది. ఇవి సాధారణంగా పాప్‌కార్న్ స్నాక్స్‌లా ఉంటాయి. మఖానాతో పలు వంటలు చేయవచ్చు. వీటిని భుజించడం ద్వారా పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రక్తంలో షుగర్ లెవల్‌ను తగ్గడంతో పాటు రక్తహీనత లేకుండా చేస్తుంది. బరువు తగ్గుతూ, ఎముకలు, కండరాలు బలపడేందుకు ఉపయోగపడుతుంది. ధర కూడా అధికంగా వస్తుండటంతో జిల్లాలో ఈ పంటను విస్తరించి మఖానా హబ్‌గా మార్చాలని తీసుకున్న నిర్ణయం బెడిసి కొట్టింది.

**ప్రయోగాత్మక సాగు విఫలం**

జిల్లాలోని త్రిపురారం మండలం కంపసాగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంతో పాటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో నీటిని నిల్వ ఉన్న మడుల్లో తామర గింజలను చల్లారు. అయితే ఆరు నెలలు కావొస్తున్నా, ఆ మడులో ఒకే ఒక్క మొక్క మొలకెత్తి ఆ తరువాత అది మాడిపోయింది. కనగల్ మండలంలో ఒక రైతు సాగు చేయగా, ఒక్క మొక్క కూడా మొలకెత్తలేదు. కట్టంగూరు, కొండమల్లేపల్లిలోని హెచ్‌ఆర్ఎస్‌లలో కూడా ఈ పంటను సాగు చేయాలని నిర్ణయించినా, ఫలితం లేకుండా పోయింది. సాధారణంగా మఖానా జల పంట అయినా, భూమిపై కూడా సాగు చేయవచ్చని అధికారులు గుర్తించారు. వాస్తవానికి అక్టోబరు లేదా నవంబరు మాసంలో తామర గింజలు చల్లాల్సి ఉండగా, మార్చి నెలాఖరున, ఏప్రిల్‌లో తీవ్ర వేసవిలో విత్తనాలు చల్లారు. దీంతో మొలకలు రాలేదని తెలుస్తోంది. చల్లటి వాతావరణం సమయంలోనే ఈ విత్తనాలు చల్లితే మొలకెత్తేవచే అభిప్రాయం ఉంది. అయితే కంపసాగర్‌లోని శాస్త్రవేత్తలకు విత్తనాలు ఏ సమయంలో చల్లాలనే ఆలోచన ఎందుకు రాలేదనే ప్రశ్న తలెత్తుతోంది. మఖానా పంట ఉత్పత్తితో పాటు ప్రాసెసింగ్‌లో సైతం బీహార్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని, అక్కడకు వెళ్లి వచ్చిన నలుగురు అధికారులు తెలిపారు. అయితే విత్తనాలు చల్లే విషయంపై జిల్లా శాస్త్రవేత్తలు దృష్టిసారించకపోవడమేంటనే ప్రశ్న ఎదురవుతోంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పసుపు బోర్డు ఇచ్చిన తరహాలో బీహార్ రాష్ట్రానికి సైతం మఖానా పంటల బోర్డును మంజూరుచేసింది. దీంతో ఈ పంట సాగుపై జిల్లాలో ఆసక్తి పెరిగింది. అయితే పంటల సాగు సంగతేమోగానీ ఆరు నెలలుగా బురద మడిలోనే తామర గింజలు మురిగిపోయాయి తప్ప, మొలకెత్తలేదు.



కంపసాగర్ నీటి మడిలో మొలకెత్తని ఫూల్ మఖానా గింజలు

## ప్రజాపాలనపై మొదలైన అసంతృప్తి



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాకేష్‌రెడ్డి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాదిన్నర సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై క్రమంగా ప్రజల్లో అసంతృప్తి మొదలైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ప్రధానాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాకేశ్‌రెడ్డికి అర్చకులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ప్రజాపాలనపై ప్రజల్లో విసుగొచ్చిందన్నారు. యూరియాను అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలోనే తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాకేశ్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెర్వుగట్టు మాజీ సర్పంచులు మేకల రాజిరెడ్డి, మల్గ బాలకృష్ణ, కమ్మంపాటి వెంకటయ్య, మేకల కరుణాకర్‌రెడ్డి, వంపు శివ, బాలెం బిక్షం, గాదరి రాంబాబు, పానుగుల్ల శంకర్, గబ్బర్‌సింగ్ పాల్గొన్నారు.

## చెరువును పరిశీలించిన ఐబీ అధికారులు


నార్కట్‌పల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీవెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి నీటి విడుదలకు తోడు భారీ వర్షాలకు వచ్చిన వరద నీటితో నిండి అలుగుపోస్తున్న నార్కట్‌పల్లి పెద్దచెరువును ఐబీ ఈఈ సతీశ్‌చంద్ర, డీఈఈ పిచ్చయ్యలు బుధవారం పరిశీలించారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత నార్కట్‌పల్లి చెర్వు నీటితో నిండుకుండలా కనిపిస్తుంది. దీంతో కట్టకు రెండువైపులా ఉన్న అలుగు (మత్తడి)లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కట్టకు ఎక్కడైనా బుంగలు లేదా లీకేజీలేమైనా ఉన్నాయా అని పరిశీలించారు. అలుగుపోస్తున్న చెరువు నీటి ద్వారా ఎం.ఎడవల్లి చెరువును నింపుతామని తెలిపారు. రెండు దశాబ్దాల తర్వాత చెరువు నిండి అలుగుపోస్తుండటంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఐబీ అధికారుల వెంట మాజీ ఎంపీటీసీ, సర్పంచులు పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, బొక్క భూపాల్‌రెడ్డి, సమద్, ప్రజ్ఞాపురం సమద్, సత్తిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నర్సింహ ఉన్నారు.

## మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యకు స్వాగతం

కట్టంగూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి సూర్యాపేటలో జరిగే మాల మహానాడు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గుండమల్ల చెన్నయ్యకు బుధవారం కట్టంగూరులో మాల మహానాడు నాయకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ మండలంలో మాల మహానాడును బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు, పోరాటాలు చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మాలల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నాగమణి, ఉపాధ్యక్షురాలు రాయల మౌనిక, జిల్లా కార్యదర్శి బూరుగు శ్రీలత, నియోజకవర్గ అధ్యక్షుడు ముడుసు బిక్షపతి, మండల అధ్యక్షుడు గండమల్ల అంతయ్య, భిక్షం, నాయకులు నర్సింహ, లక్ష్మీనారాయణ, మహేష్, కిరణ్, సైదులు ఉన్నారు.

## ఐలమ్మ జయంతి ఉత్సవకమిటీ కన్వీనర్‌గా అంజయ్య

శాలిగౌరారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 26న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య చైర్మన్‌గా ప్రభుత్వం ఘనంగా నిర్వహించే ఐలమ్మ జయంతి ఉత్సవాలకు కన్వీనర్‌గా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన తాందారి అంజయ్య (తెలంగాణ అంజన్న)ను నియమించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. యావత్ తెలంగాణ రాష్ట్రం నుంచి రవీంద్రభారతికి అధిక సంఖ్యలో రజకులు హాజరై వీరనారి ఐలమ్మ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఐలమ్మ చిత్రపటాకి నివాళులర్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు, తెలంగాణ రజక ఉద్యోగుల సంఘం తరపున ఆయన కోరారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
| --- | --- | --- | --- | --- |
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 586.60 (303.4310) | 3,66,816 | 3,66,816 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.62 (4.10) | 11,124.26 | 10,376.32 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 167.320 (34.6755) | 3,68,435 | 3,82,670 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

## జీతం రాలే.. పండుగ చేసుకునేదెలా?

● దసరాకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలు
● ఎన్నికల నోటిఫికేషన్ వస్తే జీతం ఎలా..



మండుటెండలో చేతులకు బొబ్బలు వచ్చేలా కష్టపడిన కూలీలకు వేతనాలు సకాలంలో అందడంలేదు. కుటుంబ పోషణలో కాసింత ఆసరా, అవసరాలకు సొమ్ము అక్కరకు వస్తుందన్న ఆశతో పనులకు వెళ్లిన కూలీలకు నిరాశే మిగులుతోంది. నెలానెలా చెల్లించాల్సిన జీతాలు, ప్రతీ రెండు వారాలకు ఓసారి చెల్లించాల్సిన ఉపాధి కూలి డబ్బులు నెలలు గడిచినా అందక ఇబ్బందిపడుతున్నారు. కూలీలకు పనులు కల్పించిన క్షేత్రస్థాయి సిబ్బందికి సైతం మూడునెలల వేతనాలు పెండింగ్‌లో కొనసాగుతుండడంతో దసరా పండుగకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలుపడి చూస్తున్నారు. దసరా పండుగ లోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా..? లేదోనన్న సందిగ్ధం నెలకొంది. 7

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్, మర్రిగూడ)

# మఖానా మొలకెత్తలే!



పూల్ మఖానా మొలకలు లేని కంపసాగర్ నీటి మడి

» బురద మడిలోనే తామర గింజలు
» ఆరు నెలలుగా మొలకెత్తని వైనం
» కంపసాగర్‌లో మొలిచింది ఒక్క మొక్కే
» వికటించిన పూల్ మఖానా ప్రయోగం
» దర్భాంగాలో చేసిన అధ్యయనం వృథానేనా?
» వేసవిలో విత్తనాలు నాటిన అధికారులు
» వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదన్న చర్చ

**పూల్ మఖానా సాగును జిల్లా రైతులకు పరిచయం చేయాలనుకున్న అధికారుల ప్రయత్నాలు వికటించినట్టు కనిపిస్తోంది. జిల్లా రైతులు ఏటా వరి, పత్తినే సాగుచేస్తూ ఒకసారి లాభపడితే నాలుగుసార్లు నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బీహార్ రాష్ట్రంలో విస్తృతంగా సాగవుతున్న పూల్ మఖానాను అధికారులు జిల్లాలో ప్రయోగాత్మక సాగు చేపట్టారు. అయితే ఈ విత్తనాలు మొలకెత్తలేదు.**

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

జిల్లాలో, ఆ తరువాత ఉమ్మడి జిల్లాలో పూల్ మఖానా సాగును విస్తరింపజేసి రాష్ట్రంలోనే అన్ని ప్రాంతాల్లో సాగుపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతులకు పూల్ మఖానా (తామర గింజలు) పంటను గత మార్చి నెలాఖరునా పరిచయం చేసేందుకు నిర్ణయించి ప్రణాళిక రూపొందించి అమలులోకి తెచ్చారు. తొలుత జిల్లా అధికారులు మార్చి మొదటి వారంలో బీహార్ రాష్ట్రంలోని దర్భాంగాతో పాటు మిథిలాంచల్‌లో అధ్యయనం చేసి వచ్చారు. ఈ అధ్యయన బృందంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు కూడా ఉన్నారు. వారు మార్చి మొదటి వారంలో నాలుగైదు రోజులు ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేశారు. ఆ తరువాత జిల్లాలో ప్రయోగాత్మక సాగు చేపట్టేందుకు విత్తనాలను విత్తగా జిల్లా వాతావరణం అనుకూలించలేదన్న చర్చ సాగుతోంది. నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతంతో పాటు చెరువులు, కుంటల్లో నీరు నిండుగా ఉంటే విత్తనాలు అక్టోబరు నెలలో విత్తితే మొలకెత్తే పరిస్థితి ఉంటుంది. కానీ, అందుకు విరుద్ధంగా వేసవిలో విత్తనాలు విత్తడం వల్ల ప్రయోజనం లేదనే వాదన కూడా వినిపిస్తోంది.

### పూల్ మఖానా హబ్‌గా మార్చేందుకు

పూల్ మాఖానా ఉత్పత్తితో బీహార్ రాష్ట్రంలోని మిథిలాంచల్‌తో పాటు దర్భాంగా, మధుబని, బేట్‌యా, లావూర్యా ఇతర జిల్లాలు అభివృద్ధి చెందడంతోపాటు సాగుతో ప్రసిద్ధి చెందాయి. ఆ రాష్ట్రంలో పూల్ మాఖానాకు జియో ట్యాగ్ కూడా లభించింది. ఆ రాష్ట్రంలో ప్రధానంగా చెరువులు, కుంటలు నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో వీటిని అధికంగా సాగు చేశారు. ఈ

మిగతా 8వ పేజీలో...

## అసలైన నేరస్థులు కాంగ్రెస్ పెద్దలే

**మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి**


కొత్తపేటతండాలో సాయిసిద్దును పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

దామరచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్దలే అసలైన నేరస్థులని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేటతండాలో సాయిసిద్ధును ఆయన పరామర్శించి మాట్లాడారు. యూరియా కోసం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న గిరిజన యువకుడు సాయిసిద్ధునాయక్‌పై పోలీసులు విచక్షణా రహితంగా దాడిచేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఆటవిక, అరాచక రాజ్యం నడుస్తోందని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచక పాలనచేస్తూ అక్రమ కేసులను బనాయిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో గ్రామస్థాయి నాయకులు సైతం హుకూం జారీచేస్తూ పోలీ‌స్‌స్టేషన్లలో రైతులు, సామాన్యులపై కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాను మంత్రిగా పనిచేసిన కాలంలో ఎందరో ఎస్పీలు ఉమ్మడి జిల్లాలో పని చేశారని, వారిపై తాను ఎలాంటి హుకూం జారీ చేయలేదన్నారు. గడిచిన పదేళ్లలో ఎస్పీలు స్వేచ్ఛగా విధులు నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం నిర్వాహకంపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ఇష్టం వచ్చినట్లు లాఠీలతో కొట్టే అధికారం పోలీసులకు లేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. యూరియా కోసం రోజులతరబడి లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. సాయిసిద్ధుపై పోలీసులు విచక్షణరహితంగా కొట్టి గాయపరచడం అనాగరిక చర్య అని, దీనిపై స్పందించాల్సిన జిల్లా పోలీసు అధికారులు కిందిస్థాయి అధికారులను వెనకేసుకొచ్చి తప్పేమి లేదనట్లుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరైన పద్ధతికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గిరిజన యువకుడిపై దాడి చేసిన ఎస్ఐ, పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతుల సమస్యలు పట్టని సీఎం రేవంత్‌రెడ్డి మూటలు కట్టుకొని ఢిల్లీలో సమర్పించే పనిలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆయన సంపాదనలో రాహుల్, మోదీకి 20శాతం సమర్పిస్తున్నారని విమర్శించారు. జగదీ‌ష్‌రెడ్డి వెంట ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, భగత్‌కుమార్, విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు సిద్దార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివా‌స్‌రెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, బాలాజీనాయక్, అంగోతు హాతీరాం, ప్రకా‌ష్‌నాయక్ ఉన్నారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి

**ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



నెలవారీ నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల సంఖ్య తగ్గించేందుకు ప్రణాళికా ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. కేసుల విచారణ పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకుశంగా పరిశోధించాలన్నారు. పోక్సో, తీవ్రమైన కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతీ అధికారికి సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం)పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. నేర పరిశోధన, స్టేషన్ నిర్వహణ తెలిసి ఉండాలన్నారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు సమీక్షించుకొని కేసుల సంఖ్య తగ్గించే దిశగా పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు రవికుమార్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## చేపా.. చేపా.. ఎందుకు పెరగట్లే

● నిర్లక్ష్యం నీడన 'ఇండ్లకోటయ్యగూడెం' మత్స్య బీజ క్షేత్రం
● చేప పిల్లల ఉత్పత్తి అంతంత మాత్రమే
● పట్టించుకోని అధికారులు 6

మత్స్యసంపదను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిడమనూరు మండలం తుమ్మడం శివారు ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో 1990లో 75ఎకరాల విస్తీర్ణంలో మత్స్య బీజ క్షేత్రాన్ని ఏర్పాటుచేసింది. 2.5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన 20 నర్సరీలు, 38 పాండ్స్ నిర్మించింది. కానీ గత ప్రభుత్వం మత్స్య బీజ క్షేత్రం నిర్వహణను వరంగల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. అయితే మూడేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి ఉత్పత్తి చేపట్టకపోవడంతో ఈ లీజు రద్దయింది. దీన్ని ఇటీవలి ప్రభుత్వమే నిర్వహిస్తుండగా, ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

● ఆంధ్రజ్యోతి, నిడమనూరు

## మెరుగైన వైద్యసేవలు అందించాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**


దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి వచ్చే రోగుల ఓపీ, ఏఎన్సీ, శానిటేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించి పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, రోగుల వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రకా‌ష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి డిండి రోడ్డులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, తదితరులు ఉన్నారు.

### డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, చందంపేట): చందంపేట మండలంలోని గాగిళ్లపూరంలో నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం పరిశీలించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సిబ్బంది వివరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఉన్నారు.

## పోషకాహార లోపాన్ని నివారించాలి


ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

**ఎమ్మెల్సీ శంకర్‌నాయక్**

మిర్యాలగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లు, సామాజిక మార్పుతో పోషకాహార లోపాన్ని నివారించవచ్చని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సమాచార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో 'అందరికీ పోషకాహారం'పై మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, చిన్నారుల్లో పోషకాహారలోపం కొనసాగడం విచారకరమన్నారు. రక్తహీనత నిర్మూలన, పోషకాహారం తీసుకోవడంపై కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతలు మరింత శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ, అక్టోబరు 16వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ పోషకాహారానికి సంబంధించి 40 అంశాలతో ఫొటో ప్రదర్శన నిర్వహించారు. న్యూట్రీ హబ్ కింద పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీబీసీ సహాయ సంచాలకుడు జి.కోటేశ్వరావు, సీడీపీవో మమత, వైద్యాధికారి సంజయ్‌కుమార్, పోషణ్ అభియాణ్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, పాల్గొన్నారు.

## మొక్కలు ఎండిపోకుండా చర్యలు

**డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి**


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నాంపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు తుంగపాడు గ్రామంలో నర్సరీని తనిఖీ చేసి మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మునగతోటను పరిశీలించారు. రైతు మల్లయ్యను మునగ సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మునగ లాభదాయకంగా ఉందని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఎక్కువ మంది రైతులు సాగుకు ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ఎంపీవో ఝాన్సీ, ఏపీవో వెంకటేశం, శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు, ఉన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద 6

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు 7

## త్రిపుల్‌ఆర్ బాధితులు పోరాడాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): త్రిపుల్‌ఆర్ పేరుతో ప్రభుత్వం మరోసారి రైతులను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, దీనిపై ప్రతిఘటనకు బాధితులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మలపల్లి వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిపుల్‌ఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తే రైతుల పోరాటానికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మొదటి అలైన్‌మెంట్‌కు ఒప్పందం చేసుకున్నారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రెండో, మూడో అలైన్‌మెంట్‌లను తీసుకువచ్చి 100 మీటర్లకు రహదారిని పెంచారని, పాటు అదనంగా మరో 40మీటర్లు రైల్వే లైన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతులకు మార్కెట్ ధర ప్రకారం కాకుండా రిజిస్ట్రేషన్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని చూస్తున్నారన్నారు. ఎకరాలకు రూ.80లక్షల నుంచి రూ.కోటి ధరక ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.4లక్షల వరకు పరిహారం చెల్లించాలనుకుంటోందని అన్నారు. బాధిత రైతులను ఈ నెల 26వ తేదీ వరకు సమీకరించి 27న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. త్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోయిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ, బషీర్, తదితరులు ఉన్నారు.

● అన్నపూర్ణా దేవిగా ఎల్లమ్మ


శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ 8

## పండుగలే లక్ష్యంగా ఆర్టీసీ దోపిడీ

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం**


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పండుగలే లక్ష్యంగా ఆర్టీసీ అదనపు చార్జీలు పెంచి ప్రభుత్వం దోపిడీ చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగల సమయంలో 50శాతం బస్ చార్జీలు పెంచుతున్నారని, ప్రయాణికుల సౌకర్యం కోసం బస్సులు నడపడం ప్రభుత్వం బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ పురుషుల వద్ద అత్యధిక చార్జీలు వసూలు చేయడం ఇదెక్కడి న్యాయమన్నారు. ప్రజా పాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల పాలిట కష్టాలు తెచ్చే ప్రభుత్వంగా మార్చారన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కనీసం రాష్ట్రంలో ఎంత భూమి సాగులో ఉందో లెక్కలు కూడా తెలియకుండా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రైతులు యూరియా కోసం తంటాలు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఫకీరు మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిరియాల వెంకటేశం, నాయకులు బీపంగి జగ్జీవన్, పిండి పాపిరెడ్డి, మంగళపల్లి కిషన్, దాసరి వెంకన్న, పులకరం భిక్షం, దాసరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

వేములపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ప్రమాదవశాత్తు కాల్వలో గల్లంతై మృతిచెందిన బొల్లెద్దు సతీష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, మాలి కాంతారెడ్డి, కృపయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, వినోద్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలంలోని మాదా పురం గ్రామానికి చెందిన రమావత్ దోలి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలునాయక్ బుధవారం వారి స్వగృహానికి చేరుకుని ఆమె మృతదేహాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. అనంతరం కోదండపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పోలే మహేందర్, పోలే ముత్యాలు చిత్రపటాలకు నివాళులర్పించారు.

## మల్లేపల్లికి ఆర్టీఏ కార్యాలయం మంజూరు

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రానికి ఆర్టీఏ కార్యాలయం మంజూరైనట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్థలాన్ని బుధవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటైతే కొన్నేళ్లుగా వాహన యజమానులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. త్వరలో స్థలాన్ని నిర్ధారించి ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నాయిని జమునమాధవరెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, తహసీల్దార్ సురేందర్, డీటీ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, నాయకులు మేకల శ్రీనివాస్‌యాదవ్, గంధం సురేష్ పాల్గొన్నారు.

## కళ్లను సురక్షితంగా కాపాడుకోవాలి

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సరేంద్రియానాం నయనం ప్రధానం, కళ్లను సురక్షితంగా కాపాడుకోవాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కేవీవీ రంగాచార్యులు, రంగనాయకమ్మ లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో నూతనంగా ఆరంభించిన ఆధునిక శస్త్రచికిత్స యంత్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి అందిస్తున్న కార్పొరేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆస్పత్రి ఛైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీ రఘువీర్‌రెడ్డి అందజేసిన ప్రత్యేక నిధులతో రూ.37 లక్షల విలువైన ఆధునిక యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సోషల్‌వర్కర్ డాక్టర్ జాడి రాజు మాట్లాడుతూ నేత్ర సేవలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి హాజరైన మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కేఎన్‌ప్రసాద్‌లతో కలిసి శస్త్రచికిత్సలు చేసుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎం నాయుడు, మల్లారెడ్డి, నర్సింహరావు, మురహరి, భాగ్యలక్ష్మి, క్రాంతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ఖచ్చితమైన నివేదికలు ఇవ్వాలి

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేందుకు అధికారులు ఖచ్చితమైన నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగిడి జీడయ్యయాదవ్ అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల అమలుపై బీసీలు గంపెడాశలు పెట్టుకున్నారని, వారి ఆశలు అడియాసలు కాకుండా ఖచ్చితమైన అంశాలతో నివేదికలు సమర్పించాలని కోరారు. తప్పుడు రిపోర్టులు, రాజకీయ ప్రమేయంతో తయారు చేసిన నివేదికలు సమర్పిస్తే ఆయా అధికారులపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కా నాగేశ్వరరావు, నాయకులు అశోక్, మురళి, గంగాధర్, జలంధర్, నరేష్, వెంకన్న, శ్రీను, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌కు వినతిపత్రం అందజేసినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ తెలిపారు. పట్టణ పర్యటను వచ్చిన సురేందర్‌కు స్వాగతం పలికిన అనంతరం పలు అంశాలపై వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజు, కృష్ణ, నరేందర్, రామయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా ఇబ్బందులను తొలగించాలి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా కష్టాల నుంచి రైతులను గట్టెక్కించాలని సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మండల పరిధిలోని తడకమళ్ల గ్రామానికి 12 వేల యూరియా బస్తాలు అవసరం కాగా నేటి వరకు 3774 బస్తాలు మాత్రమే వచ్చాయని అన్నారు. దీంతో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు పొట్టదశకు చేరుకుంటున్నాయని, యూరియా చల్లకపోతే పంట దిగుబడి పూర్తిస్థాయిలో తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సమస్య ను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావాండ్ల పాండు, సీతారాములు, నగేష్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.

# నిడమనూరుకు డిగ్రీ కళాశాల

● తరలిపోతున్న సాగర్ బీసీ గురుకుల కళాశాల ● సాగర్‌లో ప్రభుత్వ భవనాలు ● ప్రైవేటుకే మొగ్గు చూపుతున్న అధికారులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్‌లో ఆచార్య నాగార్జునుడు క్రీస్తు శకం 2వ శతాబ్దంలో బౌద్ధమత ప్రచారం కోసం సాగర్‌కు వచ్చి ఇక్కడ నాగార్జున విశ్వవిద్యాలయాన్ని నిర్మించారు. విద్యాపరంగా సాగర్‌లో సాగర్ హిల్‌కాలనీలో ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాల, రైట్ బ్యాంకులో జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశారు. సాగర్‌లో బీసీ గురుకులంలో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో నూటికి 90మంది ఉన్న తస్థాయిలో ఉన్నారు. అంతే కాకుండా 1969లో తొలి తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ప్రభుత్వం సాగర్ పైలాన్‌కాలనీలో బీఈడీ కళాశాలను ఏర్పాటు చేసింది. ఈ కళాశాల కూడా ఐదు దశాబ్దాల కాలం పాటు ఎందరో విద్యార్థులను ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దింది. సాగర్ హిల్‌కాలనీలో 1985లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో సీటు సాధించాలంటే ఎంతో కష్టంగా ఉండేది. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో 2022లో బాలుర బీసీ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో 320 సీట్లతో (ఒక్కొక్క సంవత్సరానికి) బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో ఎనిమిది కోర్సులను ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంగణంలో పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండటంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని బీసీ గురుకుల సొసైటీ అధికారులు డిగ్రీ కళాశాలను సాగర్ పైలాన్‌కాలనీలోనే ఉన్న పాత బీఈడీ కళాశాల భవనంలోకి తరలించాలని ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. దీంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి రెండు సార్లు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బీఈడీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. ఆ భవనం అనువుగా ఉందని చెప్పారు. కానీ ఇంతలోనే ఏమైందో ఏమో కానీ సాగర్ బీసీ డిగ్రీ కళాశాలను నిడమనూరుకు తరలించాలని నిర్ణయించారు. అక్కడ ఓ ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకొని నెలకు సుమారు రూ.2లక్షల అద్దెను చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో ఆ భవనంలో పెద్దవూరకు చెందిన మినీ గురుకుల పాఠశాల ఉండేది. అప్పుడు నిడమనూరు చెరువు అలుగుపోయడంతో వరద పాఠశాలలోకి రావడంతో అక్కడ ఉన్న విద్యార్థులను పోలీసులు, రెస్క్యూ టీం కష్టపడి రక్షించారు. వెంటనే ఆ పాఠశాల కోసం పెద్దవూర మండల కేంద్రంలో నూతన భవనం నిర్మించి అక్కడకు మార్చారు. మరల ప్రస్తుతం సాగర్ డిగ్రీ కళాశాలను అదే భవనంలోకి తరలించాలని అధికారులు చూస్తున్నారు. మరల వరదలు వస్తే పరిస్థితి ఏమిటని పలువురు వాపోతున్నారు.


సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల కళాశాలల భవన సముదాయం

### దసరా తర్వాత డిగ్రీ కళాశాల తరలింపు



నాగార్జునసాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో మూడు గ్రూపుల్లో 8 కోర్సులకు ఒక్కొక్క సంవత్సరానికి 320 సీట్ల చొప్పున మొత్తం 960 మంది విద్యార్థులు ఉండవచ్చు. కానీ ప్రస్తుతం ఇక్కడ మూడేళ్లలో కలిపి కేవలం 250మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కాబట్టి పాత బీఈడీ కళాశాల భవనంలోకి కళాశాలను తరలిస్తే బాగుంటుంది. కానీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దసరా తర్వాత నిడమనూరుకు డిగ్రీ కళాశాలను తరలిస్తున్నాం.

సీహెచ్.మాధవీలత, ప్రిన్సిపాల్

### ప్రభుత్వ భవనాలు ఉన్నా ప్రైవేట్‌కే మొగ్గు

సాగర్‌లో బీసీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి పైలాన్‌లో పాత బీఈడీ కళాశాల భవనంతో పాటు హిల్‌కాలనీలో యూత్ హాస్టల్ భవనం, సర్కిల్ ఆఫీస్ కార్యాలయం ఖాళీగా ఉన్నాయి. అంతే కాకుండా బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో ఎకరాల కొద్దీ ఖాళీ జాగా ఉంది ఇక్కడ నూతన భవనాన్ని కూడా నిర్మించుకోవచ్చు. కానీ అధికారులు మాత్రం ప్రభుత్వ భవనాలు ఎన్ని ఉన్నా ప్రైవేట్ వైపునకే మొగ్గు చూపడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


వాలీబాల్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడ లు మానసిక ఉల్లాసాన్ని, నూతనోత్తేజాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బ్రోచర్‌ను బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. సాధనతో ఆటను మరింత మెరుగుపరుచుకోవడానికి వీలవుతుందన్నారు. క్రీడా పోటీలతో టీమ్ స్పిరిట్, విజయం కోసం సమష్టి నిర్ణయాలతో తోటి మనుషుల మధ్య సఖ్యత పెంపొందే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 29, 30 తేదీల్లో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈనెల 28 సాయంత్రం 4 గం టల వరకు తమ జట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. క్రీడాకారులకు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ ఆర్గనైజర్ వెంకన్న, నాగరాజు, మనోహర్, భీమేష్, లక్ష్మణ్, అశోక్, చారి పాల్గొన్నారు.

# మఖానా మొలకెత్తలే!

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో ఆ రాష్ట్రంలో మాదిరిగానే జిల్లా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు నీరున్న ప్రాంతంలో వీటి సాగుకు నిర్ణయించి ఆ వైపుగా అడుగులు వేశారు. ఈ పంట చేతికి వచ్చేందుకు సుమారు ఎనిమిది నెలల సమయం పడుతుంది. ఐదు కిలోల విత్తనాలతో పంట సాగు చేస్తే 600కిలోల వరకు మఖానా దిగుబడి వస్తుంది. మఖానా ఉత్పత్తులకు అధిక ధరలు ఉన్నాయి. 100గ్రాముల మఖానాకు రూ.300 వరకు ధర ఉంది. ఇవి సాధారణంగా పాప్‌కార్న్ స్నాక్స్‌లా ఉంటాయి. మఖానాతో పలు వంటలు చేయవచ్చు. వీటిని భుజించడం ద్వారా పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రక్తంలో షుగర్ లెవల్‌ను తగ్గడంతో పాటు రక్తహీనత లేకుండా చేస్తుంది. బరువు తగ్గుతూ, ఎముకలు, కండరాలు బలపడేందుకు ఉపయోగపడుతుంది. ధర కూడా అధికంగా వస్తుండటంతో జిల్లాలో ఈ పంటను విస్తరించి మఖానా హబ్‌గా మార్చాలని తీసుకున్న నిర్ణయం బెడిసి కొట్టింది.

### ప్రయోగాత్మక సాగు విఫలం

జిల్లాలోని త్రిపురారం మండలం కంపసాగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంతో పాటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో నీటిని నిల్వ ఉన్న మడుల్లో తామర గింజలను చల్లారు. అయితే ఆరు నెలలు కావొస్తున్నా, ఆ మడులో ఒకే ఒక్క మొక్క మొలకెత్తి ఆ తరువాత అది మాడిపోయింది. కనగల్ మండలంలో ఒక రైతు సాగు చేయగా, ఒక్క మొక్క కూడా మొలకెత్తలేదు. కట్టంగూరు, కొండమల్లేపల్లిలోని హెచ్ఆర్ఎస్‌లలో కూడా ఈ పంటను సాగు చేయాలని నిర్ణయించినా, ఫలితం లేకుండా పోయింది. సాధారణంగా మఖానా జలపంట అయినా, భూమిపై కూడా సాగు చేయవచ్చని అధికారులు గుర్తించారు. వాస్తవానికి అక్టోబరు లేదా నవంబరు మాసంలో తామర గింజలు చల్లాల్సి ఉండగా, మార్చి నెలాఖరున, ఏప్రిల్‌లో తీవ్ర వేసవిలో విత్తనాలు చల్లారు. దీంతో మొలకలు రాలేదని తెలుస్తోంది. చల్లటి వాతావరణం సమయంలోనే ఈ విత్తనాలు చల్లితే మొలకెత్తేవచే అభిప్రాయం ఉంది. అయితే కంపసాగర్‌లోని శాస్త్రవేత్తలకు విత్తనాలు ఏ సమయంలో చల్లాలనే ఆలోచన ఎందుకు రాలేదనే ప్రశ్న తలెత్తుతోంది. మఖానా పంట ఉత్పత్తితో పాటు ప్రాసెసింగ్‌లో సైతం బీహార్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని, అక్కడకు వెళ్లి వచ్చిన నలుగురు అధికారులు తెలిపారు. అయితే విత్తనాలు చల్లే విషయంపై జిల్లా శాస్త్రవేత్తలు దృష్టిసారించకపోవడమేంటనే ప్రశ్న ఎదురవుతోంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పసుపు బోర్డు ఇచ్చిన తరహాలో బీహార్ రాష్ట్రానికి సైతం మఖానా పంటల బోర్డును మంజూరుచేసింది. దీంతో ఈ పంట సాగుపై జిల్లాలో ఆసక్తి పెరిగింది. అయితే పంటల సాగు సంగతేమోగానీ ఆరు నెలలుగా బురద మడిలోనే తామర గింజలు మురిగిపోయాయి తప్ప, మొలకెత్తలేదు.


కంపసాగర్ నీటి మడిలో మొలకెత్తని ఫూల్ మఖానా గింజలు

## బధిర విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ



విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీడబ్ల్యూవో కృష్ణవేణి

మిర్యాలగూడ, మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బధిర విద్యార్థులకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 126 మంది బధిర విద్యార్థులకు బుధవారం తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగులశాఖ మంజూరు చేసిన 10 లక్షల విలువైన స్మార్ట్‌ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బధిర విద్యార్థుల రెండో కళాశాల పట్టణంలో ఉండటం ఉపయోగకరమన్నారు. కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని, విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వం అన్నివర్గాల విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీవో మమత, అధికారులు వెంకట్‌రెడ్డి, బాలయ్య, ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, డాక్టర్లు మధుకర్, రామకృష్ణ, స్వామి వెంకట్‌రెడ్డి, బాలయ్య, వేణుగోపాలరెడ్డి, స్వామి, మధుకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


కబడ్డీ పోటీలకు ఎంపికైన పవన్, భానుప్రకాష్

హాలియా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలోని ముక్కల్‌లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే 35వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు హాలియా మునిసిపాలిటీలోని ఆకాంక్ష పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎం.పవన్, ఏ.భానుప్రకాష్ తమ ప్రతిభ చాటి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మోదాల రవీందర్, కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆవుల చంద్రశేఖర్‌యాదవ్; ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి


డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

దేవరకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ 1, 2 విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో బుధవారం ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరడం ద్వారా సామాజిక సేవ అలవాటవుతుందని, అలాగే శిబిరాలు నిర్వహించి సేవలందించిన విద్యార్థులకు అందించే సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎ స్ అధికారి డాక్టర్ మకట్‌లాల్, సురేష్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

నాగార్జునసాగర్: విద్యార్థులు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి రాజశేఖర్ అన్నారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావిభారతాన్ని నిర్మించాలంటే యువతే కీలకమని పేర్కొన్నారు. ఆధునిక పరిజ్ఞానంపై గ్రామాల్లో విద్యార్థులు తమకు వీలున్నంత వరకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు చింతపల్లి వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు సతీష్ చంద్ర, గోపాలకృష్ణ, సైదమ్మ, ఉపేంద్రాచారి, జనార్ధన్, శంకర్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

హాలియా,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం చింతగూడెం గ్రామానికి చెందిన కూరాకుల సైదులు, మారేపల్లి గ్రామానికి చెందిన రవీందర్ యాదవ్ ఇటీవల మృతి చెందారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే భగత్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు కూరాకుల వెంకటేశ్వర్లు, రాములు, కదిర కొండల్, పిల్లి మారుతీ, కూరాకుల మణి, సాగర్, కొండల్, అంజయ్య, ఎల్లయ్య, శ్రీను, వెంకటయ్య, మాలే ధర్మారెడ్డి ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

● అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు ● 108 ప్రసాదాలు సమర్పించిన భక్తులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో దేవీశరన్నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజుకో అలంకరణలో భక్తి, ఉపవాసంతో పూజిస్తున్నారు. బుధవారం అమ్మవారు అమ్మవారు భక్తులకు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని సాయినగర్‌లోని కనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న పూజలకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీర్వాదం పొందుతున్నారు. ముత్తిరెడ్డికుంట, ఎన్నెస్పీ క్యాంపు, శాంతినగర్‌లలో శక్తి ఆరాధన పూజలు నిర్వహిస్తున్నారు. వాసవీకాలనీ అమ్మవారిని బొమ్మల కొలువుతో పూజించిన కాలనీ మహిళలు, 108 ప్రసాదాలు సమర్పించారు. కార్యక్రమంలో చీదళ్ల సంధ్య, వనపర్తి సరిత, మాధవి, దీప్తి, పావని, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, సీతారామాలయం, మార్కండేయస్వామి దేవాలయం, 2వ వార్డు, బొడ్రాయి బజార్‌లలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఘనం గా పూజలు చేశారు. వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు అమ్మవారిని మహాలక్ష్మి, అన్నపూర్ణా దేవి అలంకరణలతో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలోని సీతారామచంద్ర మహేశ్వర, అయ్యప్పస్వామి దేవాలయంలో కొలువుదీరిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధ్రువనాయక్, శ్రావణ్‌రెడ్డి, బావోజీ, రమేష్‌నాయక్, భీంనాయక్, ఆలయకమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపా ల వద్దకు చేరుకున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


దేవరకొండ: వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: మండలంలోని తక్కళ్లపల్లిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం దుర్గామాతకు అష్టమూలిక అభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి వైద్యుల రవీంద్రనాథ్ శర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముద్దం రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపాల వద్ద పూజలు నిర్వహించిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో స్వాములు ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ: బొమ్మల కొలువు ఉత్సవంలో పాల్గొన్న మహిళలు


మిర్యాలగూడ: అమ్మవారికి సమర్పించిన 108 ప్రసాదాలతో భక్తులు


కొండమల్లేపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేత వడ్త్య రమేష్‌నాయక్

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : ఓజీ, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: ఓజీ, విట్రోస్: ఓజీ, కిష్కింధపురి, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : లిటిల్ హార్ట్స్, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్